**వైల్డ్ ఫైర్**

## పుష్ప-2 రేటు మరీ హాట్

- ఆస్తులమ్ముకోవాల్సిందే అంటూ నెటిజన్ల సెటైర్లు
- మల్టీప్లెక్స్‌లో టికెట్ రూ.1239
- ప్రీమియర్ షోకు రూ.800



08

**సీట్ ఫైర్**

షిండే కాదు.. ఫడ్నవీస్ కాదు..

## సీఎంగా మురళీధర్ మోహోళ్!

- ఫడ్నవీస్ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు!
- బీజేపీ హైకమాండ్ కొత్త ట్విస్ట్



02

**పొలిటికల్ ఫైర్**

అరవింద్ కేజ్రీవాల్ పై

## లిక్విడ్ ఎటాక్

- ఢిల్లీలో అలజడి
- మాజీ సీఎంకు రక్షణ కల్పించలేరా?
- బీజేపీపై మండిపడ్డ ఆప్



02


ANN తెలుగు

Follow: @ANNTELUGU

01-12-2024

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 314 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/9316 WWW.EPAPER.MAHAADAILY.COM




**కంది రామచంద్రారెడ్డి**

**వీకెండ్ అనాలసిస్**

తెలంగాణ ప్రభుత్వం రైతుపండుగ జరుపుతోంది. ఏడాదిపాలనపై రైతులు సంతృప్తిగా ఉన్నారా? అన్న ప్రశ్నలకు అసంతృప్తిగా ఉంటే రైతులు ఊరుకోరు కదా అని కొందరు మంత్రులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏడాదికాలంలో నియామకాల ద్వారా నిరుద్యోగుల విశ్వాసం పొందిన ప్రభుత్వం రైతులకు మరింత చేయాల్సి ఉందన్న అభిప్రాయంవ్యక్తమవుతోంది. మహారాష్ట్ర ఫలితాల తర్వాత ఇటీవల ప్రధాని మోడీ తెలంగాణ బిజెపి నేతలతో సమావేశమయ్యారు. తెలంగాణపై తమ చూపు ఉందన్న సంకేతాన్ని ఈ భేటీ ద్వారా ప్రధాని పంపారు. త్వరలో బిజెపి నూతన అధ్యక్షుని నియామకం కూడా జరగనున్నది. ఆ తర్వాత తెలంగాణ పొలిటికల్ పిక్చర్ లోకి కొత్త పాత్రలు వచ్చే అవకాశం కనబడుతోంది.

*- ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్*

ఎడిటోరియల్ పేజీ 4లో

## టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

**సమర్థుడికి పట్టం.. సర్వత్రా హర్షం**

**2030 వరకు పదవిలో కొనసాగనున్న వెంకటేశం**



**హైదరాబాద్:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదముద్ర వేశారు. ప్రస్తుతం టీజీపీఎస్సీ చైర్మన్‌గా ఎం మహేందర్ రెడ్డి కొనసాగుతున్నారు. మిగతా 2లో



## టీడీపీలోకి తీగల

**మహా:** మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి డిసెంబర్ 3న టీడీపీలో చేరనున్నారు. ఎన్నికలకు ముందు బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన తీగల టికెట్ రాకపోయేసరికి అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారు. ఎపిలో టిడిపి అధికారంలోకి రావడంతో తన సొంతగూటికే వెళ్ళాలని డిసైడయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో డిసెంబర్ 3న పార్టీలో చేరనున్నారు.

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 78,000 |
| 22 క్యారెట్ | 71,500 |
| సిల్వర్ (కేజీ) | 91,500 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 79,802.79 |
| నిఫ్టీ | 24,131.10 |

### ఈరోజు చికెన్ ధరలు

**1 కేజీ రిటైల్ ధర**


| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 190 | 230 | 250 |

**హోల్ సేల్ ధర**

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 170 | 210 | 220 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 6 | 180 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 6 | 180 |
| రిటైల్ గుడ్డు ధర | 6.36 | 190.8 |



# రైతుల కోసం.. ఎంత ఖర్చుచేసేందుకైనా సిద్ధం

## రైతులు ప్రతిపక్షాల ట్రాప్‌లో పడొద్దు

- మాయగాళ్ల మాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు
- కేసీఆర్ వరి వేస్తే ఉరి అన్నాడు.. మేం వరి వేస్తే బోనస్ ఇచ్చాం
- భూమి కోల్పోతున్న రైతుకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చేందుకైనా రెడీ
- పాలమూరు గడ్డ రుణం తీర్చుకుంటా.. 20 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తా

వివరాలు 2లో

“

ఈ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని రైతుల కోసం రూ.54 వేల కోట్లు ఖర్చు చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రైతుల కోసం ఇంకా సొమ్ము అయినా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మహబూబ్నగర్లో రైతు పండుగ ముగింపు వేడుక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రైతు బిడ్డగా పాలమూరు రైతుల కష్టాలు తనకు తెలుసునని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతులు ప్రతిపక్షాల ట్రాప్‌లో పడవద్దని అన్నారు. రుణమాఫీపై చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధమా అని సవాల్ విసిరారు.

**- మహబూబ్ నగర్, మహా**



## ఇదే సార్థకత

**25 లక్షల కుటుంబాలు...**

21 వేల కోట్ల రూపాయలు
రైతు రుణం తీర్చుకున్న క్షణం...
అన్నదాత ఇంట పండుగ
ఇంతకు మించి ఓ రైతుబిడ్డగా..
నా జన్మకు సార్థకత ఏముంటుంది!
మరో రూ.2747.67 కోట్లు రుణ మాఫీ చేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి



## హాట్ కామెంట్స్



### ఎవడికీ భయపడ.. నా ముందు మీరెంత

ఎవడికీ భయపడను. ఎవడికి భయపడితే.. ఇంతదూరం నేను రాను. పుట్టింది పెరిగింది నల్లమల అడవుల్లో బిడ్డా. పులులు, తోడేళ్ళు చూసినం. అన్నింటినీ ఎదుర్కొని ఇంతదూరం వచ్చినం. మానవ మృగాలు మీరెంత నా కాలి గోటితో సమానం



### తొక్కుకుంట అభివృద్ధి చేస్త

నేను ఇక్కడ పుట్టినోన్ని. ఈ మట్టిలో కలిసినోన్ని. ఈ దు.ఖం తెల్వదా. నేను ముఖ్యమంత్రిగ ఉండి ఈ పాలమూరు జిల్లాకు నిధులు తేకపోతే, నీళ్ళు ఇవ్వకపోతే. పరిశ్రమలు తేకపోతే అభివృద్ధి చేయకపోతే చరిత్ర నన్ను క్షమిస్తదా. నాతో తప్పుచేయాలని కుట్రలు చేస్తున్నరు. ఎవడు అడ్డుపడ్డా.. తొక్కుకుంటా పాలమూరు జిల్లా అభివృద్ధి చేస్త. కొడంగల్ లో పారిశ్రామిక వాడ తీసుకువస్తా. 25వేల మందికి ఉద్యోగాలు తెచ్చే జిమ్మేదారి నాది.

### అగ్గిపెట్టె రావును నమ్మకుర్ర నాయనా..

అమాయకులైన మా లంబాడీ సోదరులను జైళ్ళకు తోలింద్రు. నేను అపుడే చెప్పిన.. వాళ్ళ మాయమాటలు నమ్మకండి. వాళ్ళు ఉచ్చులో దింపుతుంద్రు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇట్లనే చేసింద్రు. అగ్గిపెట్టె రావు వంద రూపాయలు పెట్టి పెట్రోలు తెచ్చుకుండు కానీ పది పైసలు పెట్టి అగ్గిపెట్టె తెచ్చుకోలె. ఈ అగ్గిపెట్టె రావును నమ్మకుర్ర నాయనా అని చెప్పిన. అయినా మా పిల్లలు ఆవేశపడి పోతే ఈ రోజు కేసులు అయినయి.



## మనం మంచి చేస్తున్నాం

**బీఆర్ఎస్, బీజేపీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి**

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లాలి
- 10 ఏళ్లల్లో చేయలేని పనులను 10 నెలల్లో చేశాం
- గతంలో కుటుంబం బాగు పడింది

ఇప్పుడు తెలంగాణ బాగుపడుతుంది..పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మహా:** పార్టీ కోసం కష్టించి పని చేసిన ప్రతీ ఒక్కరికి గుర్తింపు ఉంటుందని, సరైన సమయంలో సరైన విధంగా వారికి ప్రాధాన్యం పార్టీ ఇస్తుందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలోని కింద స్థాయి నాయకుల కష్టంతోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామన్నారు. రానున్న రోజుల్లో పార్టీలోని నేతలకు అన్ని రకాల పదవుల్లో అవకాశం కల్పిస్తామన్నారు. మిగతా 2లో

## రాజకీయాలకు దూరం!

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్.. కేటీఆర్ ఊహించని నిర్ణయం**

**స్మాల్ బ్రేక్ అంటూ ఎక్స్ వేదికగా వెల్లడి**

- మూసీ, లగచర్ల, దిలావర్‌పూర్ వంటి అంశాలు రివర్స్ కావడమే కారణమా?
- దీక్షా దివస్ సైతం సక్సెస్ కాలేదనా..పార్టీలో అంతర్గత కలహాల వల్లే ఈ నిర్ణయమా?
- అసలు.. బీఆర్ఎస్‌లో ఏం జరుగుతోంది.. ఇప్పటికే కీలక నేతలు దూరం
- మరి పార్టీని లీడ్ చేసేదెవరు?.. పార్టీ శ్రేణుల్లో అయోమయం

**మహా, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీలో ఏం జరుగుతోంది? కారులో అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరాయా? కీలక నేతలు రెస్ట్ పేరిట దూరంగా ఉంటున్నారా? కేసీఆర్ బాటలో కేటీఆర్ నడుస్తున్నారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. పార్టీని లీడ్ చేసేదెవరు? ఇవే ప్రశ్నలు పార్టీ నేతల్లో వెంటాడుతున్నాయి. మరోవైపు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కీలక నేతలు దూరంగా ఉంటున్నారు. మిగతా 2లో





## నన్ను జైలుకు పంపండి

- కొండా సురేఖకు మంత్రిగా కొనసాగే అర్హత లేదు
- రేవంత్ ప్రొటెక్షన్ ఫోర్స్‌గా విద్యాకమిషన్
- ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు

03

## కాంగ్రెస్ ఏడాది పాలన డొల్ల

- ఒక్క రేషన్ కార్డు ఇవ్వలే
- కాంగ్రెస్ పాలనపై బీజేపీ నేడు చార్జ్‌షీట్ విడుదల
- డిసెంబర్ 6 న సరూర్ నగర్ స్టేడియంలో బహిరంగసభ
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



వివరాలు 3లో


## చికాగోలో కాల్పులు

**ఖమ్మం విద్యార్థి మృతి**

వివరాలు 2లో

## ఏఈఈ ఇంట్లో రూ.300 కోట్లు

- ఇరిగేషన్ శాఖలో అవినీతి అనకొండ
- చిన్నచేప అనుకుంటే.. తిమింగలమే చిక్కింది
- గండిపేట, మణికొండ, నార్సింగిలలో దందా
- నిఖేష్ కుమార్ అక్రమాలు తవ్వినకొద్దీ కోకొల్లలు



వివరాలు 2లో

### షిండే కాదు.. ఫడ్నవీస్ కాదు..
# సీఎంగా మురళీధర్ మోహోల్!



**మహా:** మహా రాష్ట్ర రాజకీయాలు.. ఎప్పటిలాగే ట్విస్ట్ల మీద ట్విస్ట్ లతో కొనసాగుతున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి వారం రోజుల వుతున్నా కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతోంది. నాలుగింట మూడు వంతుల మెజారిటీతో ఘన విజయం సాధించిన మహాయుతి తరపున ముఖ్యమంత్రి ఎవరనేది స్పష్టం కాలేదు. మహారాష్ట్ర సీఎం రేసులో బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్ కాకుండా కొత్త పేరు తెరపైకి వచ్చింది. సీఎంగా కొత్తగా బీజేపీ నేత, కేంద్ర సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ పేరు వినిపిస్తోంది. బీజేపీ పుణె ఎంపీ అయిన మురళీధర్ ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. గతంలో పుణె మేయర్గా మురళీధర్ పనిచేశారు. రాజకీయ వర్గాల్లో పెద్దగా ప్రచారంలో లేని మురళీధర్ను బీజేపీ అగ్రనాయకత్వం మహారాష్ట్ర సీఎం పదవికి సూచిస్తున్నట్లు తెలుస్తోంది. అటు దేవేంద్ర ఫడణవీస్కు బీజేపీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. వీటిపై మరో రెండు మూడు రోజుల్లో స్పష్టత రానుంది. కొత్త ప్రభుత్వం డిసెంబర్ 2 లేదా ఆ తర్వాతే ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

# అరవింద్ కేజ్రీవాల్ పై లిక్విడ్ ఎటాక్



**ఢిల్లీ, మహా:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్పై ఓ వ్యక్తి లిక్విడ్ను చల్లాడు. పాదయాత్రలో భాగంగా ప్రజల మధ్య నుంచి అభివాదం చేస్తూ కేజ్రీవాల్ నడుస్తుండగా ఒక వ్యక్తి గుర్తు తెలియని ద్రవాన్ని చిమ్మడం కలకలం సృష్టించింది. అయితే వెంటనే అప్రమత్తమైన కేజ్రీవాల్ భద్రతాసిబ్బంది ఆ వ్యక్తిని వెనక్కిలాగేశారు. దీనితో అక్కడ తీవ్రమైన అలజడి ఏర్పడింది. పోలీసులు వెంటనే ఓ తాడుతో కేజ్రీవాల్ చుట్టూ భద్రతావలయంగా ఏర్పడ్డారు. ఢిల్లీలో శాంతిభద్రతలు కేంద్రహోం శాఖ పరిధిలో ఉంటాయి. తాజా ఘటన నేపథ్యంలో బీజేపీపై ఆప్ పార్టీ తీవ్రంగా మండిపడింది.

# చికాగోలో కాల్పులు.. ఖమ్మం విద్యార్థి మృతి



**మహా, ఖమ్మం:** అమెరికాలో తుపాకీ తూటాకు మరో తెలుగు విద్యార్థి బలయ్యాడు. చికాగో లో దుండగులు జరిపిన కాల్పుల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 26 ఏళ్ల సాయి తేజ అనే విద్యార్థి మరణించాడు. అతడు ఖమ్మం రూరల్ జిల్లా రామన్నపేట్కు చెందిన వాడిగా గుర్తించారు. సాయితేజ ఎంఎస్ చదవడానికి నాలుగు నెలల క్రితమే యూఎస్ వెళ్లినట్లు తెలిసింది. అయితే, కాల్పులకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు. సాయి తేజ మరణంతో రామన్నపేట్ లో విషాద ఛాయలు అలముకున్నాయి. కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడన్న వార్తతో అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుమారుడి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

### బంగ్లాదేశ్లో హిందువుల మీద దాడులపై..
# తీవ్రంగా స్పందించిన ఆరెస్సెస్

**ప్రకటన విడుదల చేసిన ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే**

**దాడులపై బంగ్లాదేశ్ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తోందని విమర్శ**



**మహా:** బంగ్లాదేశ్లో హిందువులు, ఇతర మైనార్టీలపై జరుగుతోన్న దాడుల మీద రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తూ శనివారం ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ మేరకు ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే ప్రకటనను విడుదల చేశారు. మైనార్టీలపై దాడుల అంశం మీద అక్కడి ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తోందని ఆరెస్సెస్ విమర్శించింది. ఇటీవల అరెస్టైన చిన్మయ్ కృష్ణదాస్ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. బంగ్లాదేశ్లో హిందువులు, మహిళలు, ఇతర మైనార్టీలపై జరుగుతోన్న దాడుల మీద ప్రభుత్వం మౌనం వహిస్తోందని ఆరోపించింది. హిందువులపై దౌర్జన్యాన్ని ఆపాలని, అలాగే ఇస్కాన్ గురువును వెంటనే విడుదల చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది డిమాండ్ చేసింది. పక్క దేశంలో మైనార్టీలపై జరుగుతోన్న దాడులను అరికట్టే దిశగా భారత ప్రభుత్వం ప్రయత్నాలను కొనసాగించాలని కోరింది. ఈ దాడుల విషయంలో ప్రపంచ మద్దతు దిశగా చర్యలు చేపట్టాలని సూచించింది.

# రాష్ట్రంలో అత్యుత్తమ ఎంఎస్ఎంఈ పాలసీ



**మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో అత్యుత్తమ ఎంఎస్ ఎంఈ పాలసీ తీసుకొచ్చామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బలహీన వర్గాలకు చెందిన పారిశ్రామికవేత్తల కోసం బిక్కి ఏర్పాటు చేయడం అభినందనీయని తెలిపారు. బిక్కి ప్రతిపాదనలకు అనుగుణంగా పారిశ్రామిక విధానాల్లో మార్పులు చేస్తామని చెప్పారు. బ్యాక్వర్డ్ క్లాసెస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో టీహబ్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. '' మా ప్రభుత్వం వచ్చి సంవత్సరం అయ్యింది. అత్యుత్తమ ఎంఎస్ఎంఈ పాలసీని అందుబాటులోకి తీసుకొచ్చాం. విధానాలను ఆచరణలో పెట్టడమే ఇప్పుడు పెద్ద సవాల్. సమ్మిళిత అభివృద్ధి కోసం మా ప్రభుత్వం కృషి చేస్తోంది. 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాకు అనుగుణంగా కార్యక్రమాలు ఉండాలనేదే మా ప్రభుత్వ విధానం. ఉపాధి కులాలవారీగా అందాలనే ఉద్దేశంతోనే కులగణన చేస్తున్నాం. ఎన్ని సవాళ్లు వచ్చినా కూడా అధిగమిస్తున్నాం. సవరణ అవసరం అయితే కేంద్ర ప్రభుత్వ సాయం తీసుకుంటాం. అలాగే బిక్కి ప్రతిపాదనలకు అనుగుణంగా పారిశ్రామిక విధానాల్లో మార్పులు కూడా చేస్తాం. వివిధ బ్యాంకుల నుంచి రుణాలు, ప్రభుత్వ శాఖల నుంచి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం. వెనుకబడిన వర్గాల పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తాం. ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల్లో పరిశ్రమలు విస్తరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని'' మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

# రైతుల కోసం.. ఎంత ఖర్చుచేసేందుకైనా సిద్ధం





**మహబూబ్ నగర్, మహా:** ఈ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని రైతుల కోసం రూ.54 వేల కోట్లు ఖర్చు చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రైతుల కోసం ఇంకా సొమ్ము అయినా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మహబూబ్నగర్లో రైతు పండుగ ముగింపు వేడుక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రైతు బిడ్డగా పాలమూరు రైతుల కష్టాలు తనకు తెలుసునని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తెలిపారు. రైతులు ప్రతిపక్షాల ట్రాప్లో పడవద్దని అన్నారు. రుణమాఫీపై చర్చకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధమా అని సవాల్ విసిరారు. గతేడాది నవంబర్ 30వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని తెలిపారు. దొరల గడీలను కూల్చారని చెప్పారు. పాలమూరులో కృష్ణమ్మ పారుతున్నా ప్రజల కష్టాలు తీరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం ముంబై, హైదరాబాద్కు వలసలు పోయే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అన్నారు.

## బీఆర్ఎస్ మోసం చేసింది

మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తర్వాత... ఇన్నాళ్లకు మళ్లీ పాలమూరు బిడ్డ సీఎం అయ్యారని గుర్తుచేశారు. తనకు వచ్చిన అవకాశాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తున్నానని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్లందరూ జూనియర్ అయినా తనకు సహకరిస్తున్నారని సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతురుణమాఫీని పూర్తి చేసిందా అని ప్రశ్నించారు. వడ్డీతో సహా రూ.లక్ష రుణమాఫీ చేస్తామని బీఆర్ఎస్ మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చింది వడ్డీలకు కూడా సరిపోలేదన్నారు.

## అభివృద్ధిని అడ్డుకోవద్దు

"గతంలో ఎవరూ భూసేకరణ చేయలేదా. ...ప్రాజెక్టులు కట్టలేదా.. పరిశ్రమలు నిర్మించలేదా. నా జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి.. ప్రజలకు ఉపాధి కల్పించాలని భావించాను. మాయగాళ్ల మాటలు విని పరిశ్రమలను అడ్డుకుంటున్నారు. మాయగాళ్ల మాటలు విని లగచర్ల ప్రజలు కేసుల్లో ఇరుకున్నారు. జిల్లాను అభివృద్ధి చేయాలంటే భూసేకరణ చేయాలా.. వద్దా. అధికారులను కొడితే శ్రీశైలం.. సాగర్ ప్రాజెక్టులు పూర్తయ్యేవా. మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు. కేసీఆర్కే గజ్వేల్లో వెయ్యి ఎకరాల ఫామ్ హౌస్ ఉంది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్రావుకు పెద్దపెద్ద ఫామ్హౌస్లు ఉన్నాయి. ప్రజలను రెచ్చగొట్టి కేసుల పాల్జేసి వాళ్లు వెళ్లి ఫామ్హౌస్లో ఉంటారు. కేసీఆర్ చేసిన దోపిడీకి ప్రజలు, కాంగ్రెస్ ప్రభుత్వం బలైపోయింది. మల్లన్నసాగర్లో భూమి పోతే రైతు చితిపేర్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు మల్లారెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ న్యాయం చేసిందా. భూములు కోల్పోతున్నవారు పరిహారం అడగండి ఇస్తాను. కావాలంటే ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అయినా ఇస్తాం. మాయగాళ్ల మాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు. వచ్చే రెండేళ్లలో 20లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రయత్నిస్తా. పాలమూరు గడ్డ రుణం తీర్చుకుంటా'' అని సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ,తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి క్రిష్ణారావు, సీతక్క, ఎంపీ మల్లురవి, వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, మేఘారెడ్డి, పర్ణికారెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, మధుసూధన్ రెడ్డి, వంశీ, రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పండుగ తెచ్చాం

**వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్లే అని కేసీఆర్ అనలేదా అని రేవంత్ నిలదీశారు. తమ ప్రభుత్వం మాత్రం వరి వేస్తే.. రూ.500 బోనస్ ఇచ్చి.. వరి రైతులకు పండుగ తెచ్చిందని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరానికి రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. మూడేళ్లు నిండకుండానే కాళేశ్వరం కూలిందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది తెలంగాణలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని తెలిపారు.దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రుణమాఫీ చేశామని సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. సాగుకు ఉచిత కరెంట్ పేటెంట్ హక్కు కాంగ్రెస్దేనని తెలిపారు. ఎవరెవరో వచ్చి పాలమూరును దత్తత తీసుకుంటానని ప్రకటించారని.. ఆయన ఈ జిల్లాకు చేసిందేమీ లేదని అన్నారు. మన ప్రాజెక్టులకు నిధులు ఇచ్చేందుకు కేసీఆర్కు మనసు రాలేదని.. ఎంపీగా గెలిపించిన జిల్లాకు కేసీఆర్ ఏం చేశారో చెప్పాలని సీఎం రేవంత్రెడ్డి ప్రశ్నించారు.**

# టీజీపీఎస్సీ చైర్మన్గా బుర్రా వెంకటేశం

**సమర్థుడికి పట్టం.. సర్వత్రా హర్షం**

**2030 వరకు పదవిలో కొనసాగనున్న వెంకటేశం**

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పదవీకాలం డిసెంబర్ 3న ముగియనుంది. దీంతో కొత్త చైర్మన్ నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించింది. మొత్తం 45 అప్లికేషన్లు రాగా అందులో రిటైర్డ్ ఐఏఎస్లు, వివిధ వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు కూడా ఉన్నారు. వారిలో బుర్రా వెంకటేశంను ఎంపిక చేసిన ప్రభుత్వం.. నియామక ఆమోదం కోసం ఫైలును రాజ్భవన్కు పంపించింది. దీంతో శనివారం ఉదయం ఆ ఫైలుపై గవర్నర్ సంతకం చేశారు. దీంతో మరో నాలుగేండ్ల సర్వీస్ ఉన్నప్పటికీ.. ముందుగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేయనున్నారు. డిసెంబర్ 2న టీజీపీఎస్సీ చైర్మన్గా బాధ్యతలు తీసుకోనున్నారు. 2030 వరకు ఆ పదవిలో కొనసాగనున్నారు. కాగా, 1995 ఐఏఎస్ బ్యాచ్కు చెందిన బుర్రా వెంకటేశం ఆ ఏడాది యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు, ఉమ్మడి ఏపీలో మొదటి ర్యాంకు సాధించాడు. వివిధ జిల్లాలో అడిషనల్ కలెక్టర్గా, కలెక్టర్గా బాధ్యతలు నిర్వర్తించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేద కుటుంబంలో పుట్టి.. తన ఏడవ ఏటనే తండ్రిని కోల్పోయారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, ట్యూషన్లు చెబుతూ ఎంతో కష్టపడి సివిల్స్ సాధించారు. 2019లో 'సెల్ఫీ ఆఫ్ సక్సెస్' పేరుతో ఆయన ఇంగ్లిష్లో ఓ పుస్తకాన్ని రచించారు.

# రాజకీయాలకు దూరం!

(మొదటిపేజీ తరువాయి)

కారణం ఏమైనా కావచ్చు.. తొలుత మాజీ సీఎం కేసీఆర్ పార్టీ వ్యవహారాలకు దూరమయ్యారు. ఒక్కమాటలో చెప్పాలంటే అసెంబ్లీ కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటున్నారు. బయటకు రాలేదు.. ఎక్కడ ప్రసంగాలు చేయలేదు. ఒకవిధంగా చెప్పాలంటే రాజకీయాలకు విరామం ప్రకటించినట్టేనని కొందరి మాట.

**బూమ్రంగ్ కావడం వల్లే..**

కేసీఆర్ దూరంగా ఉండడంతో బాధ్యతలను మోస్తూ వస్తున్నారు కేటీఆర్. అధికార ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేవనెత్తిన పలు అంశాలు బూమ్రంగ్ అయ్యాయి. మూసీ, లగచర్ల, దిలావర్పూర్ వంటి అంశాలు రివర్స్ అయ్యాయి. వీటిపై సరైన స్పందన లేకపోవడంతో అసహనంలో ఉన్నారట కేటీఆర్. ఈ క్రమంలో కొద్దిరోజులు రాజకీయాలకు విరామం ఇవ్వాలని కేటీఆర్ నిర్ణయం తీసుకోవడం, ఈ విషయాన్ని బయట పెట్టారు. వెల్ నెస్ రిట్రీట్ కోసం కొన్ని రోజులు వెళ్తున్నానంటూ 'ఎక్స్'వేదికగా వెల్లడించారు కేటీఆర్.

**రాజకీయ సన్యాసమా?..**

ఏడాదిగా పార్టీని నడపడంలో కేటీఆర్ విఫలమయ్యారంటూ ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఆయన స్మాల్ బ్రేక్ చెప్పడంపై చర్చించుకోవడం నేతల వంతైంది. విరామం తాత్కాలికమేనా? రాజకీయ సన్యాసమా? అంటూ ప్రత్యర్థుల నుంచి కామెంట్లు పడిపోతున్నాయి.

**నేతల్లో అంతర్మథనం..**

బీఆర్ఎస్ పార్టీలో ఈ మధ్య నేతల మధ్య చర్చ జరుగుతోంది. అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యర్థులను ఎదుర్కొన్నట్టుగా ఇప్పుడు ఫేస్ చేయలేకపోతున్నామని కొందరు వాపోతున్నారట. మనకు మిగతా పార్టీల మాదిరిగా ఎన్నికల వ్యూహకర్త ఉంటే బాగుంటుందని పార్టీ దృష్టికి తెచ్చారట. దీనిపై కేటీఆర్ సైలెంట్ అయిపోయారని అంటున్నారు. విరామం సమయంలో అటువైపు కేటీఆర్ దృష్టిసారించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఇంతకీ బీఆర్ఎస్ నేతల మదిలో ఏముందో తెలియాలంటే కొద్దిరోజులు వెయిట్ చేయక తప్పదు. ఈలోగా కేటీఆర్ గురించి ఇంకెన్ని విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాలి. కేటీఆర్ విరామం తర్వాత పార్టీని ఎవరు లీడ్ చేస్తారు? హరీష్రావా? లేక కవితక్కా? ఎవరు రంగంలోకి దిగుతున్నారు? హరీష్రావు వాయిస్ ప్రజల్లోకి బలంగా వెళ్లలేకపోతుందన్నది కొందరి మాట. ఈ గ్యాప్ని కవితక్క తీసుకుంటుందా? లేదా అన్నది చూడాలి.



## దీక్షా దివస్కు కానరాని స్పందన..

**తెలంగాణ వ్యాప్తంగా శుక్రవారం కేసీఆర్ దీక్ష దివాస్ కార్యక్రమం నిర్వహించింది బీఆర్ఎస్ పార్టీ. నేతల, కార్యకర్తల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదట. కొన్ని చోట్ల కేడర్–నేతల మధ్య చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఇది జరిగి 24 గంటలు గడవక ముందే స్మాల్ బ్రేక్ అని కేటీఆర్ చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోంది. రాజకీయాలకు కేటీఆర్ విరామం సమయంలో హైదరాబాద్లో ఉంటారా? లేక విదేశాలకు వెళ్తున్నారా? అన్న డౌంట్ని వ్యక్తం చేస్తున్నారు కార్యకర్తలు. పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు కేటీఆర్ విదేశాలకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.**

# మనం మంచి చేస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)


శనివారం గాంధీభవన్లో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, గడచిన దశాబ్ధ కాలంగా రాష్ట్రాన్ని ఇష్టం వచ్చినట్లు దోచుకున్నారంటూ బీఆర్ఎస్ నేతలపై ఆయన మండిపడ్డారు. అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడి రాష్ట్రాన్ని నాశనం చేసిన చరిత్ర బీఆర్ఎస్ వాళ్ళదని ఆయన విమర్శించారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ నేతలు రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి ఆర్థికంగా దివాళా తీయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని రకాల హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని మంచి పనులు చేసిన.. బీఆర్ఎస్ నేతలు మనపై అబద్దాలు ప్రచారం చేస్తూ రాజకీయంగా పబ్బం గడుపుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మనం చేసిన పనులను మనం చెప్పుకోకపోతే వెనుకబడిపోతామని పార్టీ కేడర్కు ఆయన కీలక సూచన చేశారు.

బీఆర్ఎస్, బీజేపీలు మనపై చేస్తున్న అబద్ధాలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ పిలుపు నిచ్చారు. 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన ప్రభుత్వానిదని తెలిపారు. రైతు రుణమాఫీ కోసం 18 వేల కోట్లు కేటాయించామని, ఇంకా3 వేల కోట్లు ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ళలో రైతులకు ఏం చేయలేదన్నారు. ఇచ్చిన హామీల.ప్రకారం బస్ లలో మహిళలకు ఉచిత ప్రయాణాలు, 200 యూనిట్ల కరెంట్, 500 రూపాయలకే సిలిండర్, ఆరోగ్య శ్రీ పథకాలు లాంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలన్నారు. బీజేపీ మతతత్వ ప్రచారంతో లబ్ది పొందుతుందని ఆరోపించారు. అయితే బీజేపీ మతతత్వ ప్రచారాన్ని మోడీ అబద్దాలను సైతం తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత మనపై ఉందని ఈ సందర్భంగా పార్టీ కేడర్కు ఆయన సూచించారు. లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని దేశానికి ప్రధానిగా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. దేశాన్ని ఒక్కతాటిపైకి తెచ్చి అభివృద్ధి చేసే లక్ష్యంతో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కులగణన సర్వే ఎంత అవసరమో ఆయన వివరించారన్నారు. అదే ప్రస్తుతం తెలంగాణలో అమలు జరుగుతుందని వివరించారు. రాహుల్ గాంధీ స్వాతిముత్యం అంత మంచి వాడని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. ఆయన అన్ని రకాల మంచి పనులు చేస్తున్నారని తెలిపారు. నాగార్జున సాగర్లో వారం రోజుల పాటు ఆదివాసీ క్యాంపు నిర్వహించనున్నామని ఆయన స్పష్టం చేశారు.

ఆదివాసీ అంశాలపై లోతుగా చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు నాగార్జున సాగర్ లో వారం రోజుల పాటు క్యాంపు నిర్వహించనున్నామని ఏఐసీసీ జాతీయ నాయకులు కొప్పుల రాజు తెలిపారు. రోజుకు 7,8 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# ఏఈఈ ఇంట్లో రూ.300 కోట్లు

- **ఇరిగేషన్ శాఖలో అవినీతి అనకొండ**
- **చిన్నచేప అనుకుంటే.. తిమింగలమే చిక్కింది**
- **గండిపేట, మణికొండ, నార్సింగిలలో దందా**
- **నిఖేష్ కుమార్ అక్రమాలు తవ్వినకొద్దీ కోకొల్లలు**



**హైదరాబాద్, మహా:** ఎసిబికి మరో అవినీతి అనకొండ చిక్కింది.. చిన్న చేప అనుకుని సోదాలు చేస్తే ఏకంగా దిమ్మ తిరిగేలా రూ .300 కోట్ల అక్రమ ఆస్తులు సంపాదించినట్లు వెల్లడైంది.. వివరాలలోకి వెళితే ఆదాయానికి మించిన ఆస్తుల ఉన్నాయనే అరోపణపై హైదరాబాద్ లోని నీటి పారుదల శాఖ ఏఈఈ గా పని చేస్తున్న నిఖేశ్ కుమార్ నివాసంలో నేటి ఉదయం ఏసీబీ సోదాలు చేపట్టారు. శనివారం ఉదయం 6గంటల నుంచి ఈ సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక నిఖేశ్ బంధువులతో పాటు సన్నిహితుల ఇళ్లలో కలిపి మొత్తం 30 ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నట్టు సమాచారం. ఇప్పటి వరకు జరిపిన సోదాల్లో ఫాంహౌస్లతో పాటు భారీగా వ్యవసాయ భూములు, భవనాలు ఉన్నట్టు గుర్తించారు. కేజీల కొద్దీ బంగారం నివాసం బయట పడింది. ఇప్పటి వరకు గుర్తించిన ఏఈఈ ఆస్తులు మార్కెట్ విలువ ప్రకారం___ దాదాపు రూ.300 కోట్లకు పైనే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇక గండిపేట బఫర్ జోన్, ఎఫ్టీఎల్లో నిబంధనకు విరుద్ధంగా నికేష్ కుమార్ అనుమతులు ఇచ్చినట్టు ఏసీబీ గుర్తించింది. ఇదే సమయంలో గండిపేట, హిమాయత్ సాగర్, నార్సింగి, మణికొండ, రాజేంద్రనగర్ పరిధిలో భారీగా అక్రమాలకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఇక, నికేష్ పేరిట మూడు ఇల్లులు ఉండగా.. ఫామ్ హౌస్లు కూడా ఉన్నాయి. ఫామ్ హౌస్ల విలువ రూ.80 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇదిలా ఉండగా.. నికేష్ ప్రస్తుతం సస్పెన్షన్లో ఉన్నారు. గతంలో లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ నికేష్ ఏసీబీకి దొరికారు. ఈ కేసులో సస్పెండ్ అయిన ప్రస్తుతం ఇంటిలోనే ఉంటున్నారు.. అయితే అయన ఇంటిలో ఉన్నప్పటికీ పలు ఫిర్యాదులు రావడంతో తాజాగా ఆయన నివాసం పైనా, అతడి బంధువులు, స్నేహితుల ఇళ్లపైనా ఏకంకాలంలో నేడు దాడులు నిర్వహించారు.. ఈ సోదాల వివరాలను నేడు గానీ, రేపు గాని అందిస్తామని ఎసిబి అధికారులు చెప్పారు.



## గుండెపోటుతో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

# బాలమల్లేశ్ కన్నుమూత

**హైదరాబాద్, మహా:** సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ తుది శ్వాస విడిచారు. గుండెపోటు రావడంతో ఇంట్లోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు గమనించి ఈసీఐఎల్‌లోని సమీప ఓ ప్రైవేటు హాస్పిటల్కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. బాలమల్లేశ్ భౌతికకాయాన్ని యాప్రాల్‌లోని ఆయన నివాసానికి తరలించారు. దీంతో అక్కడంతా విషాదఛాయలు అలుముకున్నాయి. దీర్ఘకాలంగా ప్రజా ఉద్యమాల్లో చెరగని ముద్ర వేసిన బాలమల్లేశ్కు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాలమల్లేశ్ మృతిపట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బాల మల్లేశ్ మృతి సీపీఐ రాష్ట్ర సమితికి తీరని లోటన్నారు.

# కాంగ్రెస్ ఏడాది పాలన డొల్ల

## ఒక్క రేషన్ కార్డు ఇవ్వలే

### కాంగ్రెస్ పాలనపై బీజేపీ నేడు చార్జీషీట్ విడుదల
### డిసెంబర్ 6 న సరూర్ నగర్ స్టేడియంలో బహిరంగసభ
### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలన బీఆర్ఎస్ పదేళ్ళ పాలనను మరిపిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఏడాది పాలనలో ఎన్నో చేశామని గొప్పలు చెప్పుకుని సంకలు గుద్దుకుంటూ ఉత్సవాలు చేసుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్తగా ఒక్క రేషన్ కార్డును కూడా జారీ చేయలేదని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్లకు ప్రత్యామ్నాయం బీజేపీయే అని తెలంగాణ ప్రజదలు భావిస్తున్నారని, ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, హామీల అమలు సాధన దిశగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీకి మంచి భవిష్యత్ ఉందని, ప్రజలు పార్టీవైపు చూస్తున్నారంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన కిషన్ రెడ్డి మోడీ మాటలను నిజం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీకి బూత్ స్థాయి నుంచి నాయకత్వం అవసరమని, ఆ దిశగా మరింత గట్టిగా ప్రయత్నం చేయాలన్నారు. గడచిన ఏడాది కాలంగా కాంగ్రెస్ పార్టీ ఒకక ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని, గత ప్రభుత్వం చేసిన నోటిఫికేషన్ లను



ప్రాసెస్ చేసి ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు చెబుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై ఆదివారం బీజేపీ చార్జీషీట్ ను ప్రజల ముందు ఉంచనున్నామని తెలిపారు. చార్జీషీట్ లో రేవంత్ పాలనలోని వైఫల్యాలను ప్రజలకు తెలుపుతామని, బీజేపీ శ్రేణులు చార్జీషీట్ లోని అంశాలను ప్రజల ముందుంచి చర్చ పెట్టాలని పిలుపునిచ్చారు. హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింతర్వాత తప్పించుకుంటుందని, హామీలను అమలు చేసేంత వరకు ప్రజల్లో కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలపాలన్నారు. స్థానిక సంస్థల్లో బీజేపీ గట్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, అన్నిస్థానాల్లో పార్టీ అభ్యర్థులను రంగంలోకి దింపి సత్తా చాటాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వార్డు మెంబర్లతో పాటుపురపాలికలు, కార్పొరేషన్లలోనూ పార్టీ బలం నిరూపించకోవాలన్నారు.

## డిసెంబర్ 6 బహిరంగసభ

కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలను ఎండగట్టేందుకు డిసెంబర్ 6 న హైదరాబాద్ లో భారీ భహిరంగసభను నిర్వహిస్తున్నామని ప్రకటించారు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ఈ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా కానీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కానీ హాజరవుతారన్నారు. ఈ సభలో ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాస్తవంగా అమలు చేసిన హామీలపై ప్రజలకు తెలుతామన్నారు. రాబోయే కాలంలో బీజేపీ పోషించే పాత్రపై ప్రజలకు స్పష్టత ఇవ్వనున్నామని తెలిపారు. తెలంగణలో అమలు చేయని హామీలపై పొరుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంపై కూడా ప్రజలకు తెలుపుతామన్నారు.

# అంగన్ వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో గ్యాప్ ఉండొద్దు

## 100 శాతం టార్గెట్ ను రీచ్ కావాలి

- మూడు నెలల సమయం ఇస్తున్నాం
- పాల సరఫరాను విజయ డెయిరీ మెరుగు పరుచుకోవాలి
- పోషకాహార తెలంగాణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ఆరోగ్య లక్ష్మీ పథకంపై మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్, మహా:** అంగన్ వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో ఎటువంటి గ్యాప్ లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాలు జారీ చేసారు. మారు మూల ప్రాంతాల్లోని అంగన్ వాడీ కేంద్రాలను సకాలంలో పాల సరఫరా జరగాల్సిందేనని స్పష్టం చేసారు. పోషకాహార తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య లక్ష్మీ పథకంపై మంత్రి సీతక్క మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఇతర ఉన్నతాధికారులతో కలసి మంత్రి సీతక్క సమీక్షించారు.

గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మీ పథకాన్ని అమలు చేస్తుంది. ఇందులో బాగంగా ప్రతి రోజు 200 ఎంఎల్ పాలను గర్భిణీలు, బాలింతలకు అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పంపిణి చేస్తారు. ప్రభుత్వ విజయ డెయిరీ టెట్రా ప్యాకెట్ల అంగన్ వాడీ కేంద్రాలకు సప్లై చేస్తుంది. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 1.67 కోట్ల లీటర్ల సరఫరా కోసం ఆర్డర్ చేయగా...1.56 కోటి లీటర్ల పాలను విజయా డెయిరీ సరఫరా చేయగలిగింది. అంటే 94 శాతం మేర సప్లై చేయగలిగింది. అయితే కొన్ని అంగన్ వాడీ సెంటర్లకు సకాలంలో పాలు సప్లై కాకపోవడం పట్ల మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. అంగన్ వాడీ కేంద్రాలకు ప్రభుత్వం కోరినంత మేర పాలు సరఫరా చేయగలరా? లేదా? అంత సామర్థ్యం ఉందా? లేదా? సరిపోయినంత సప్లై చేసే శక్తి లేకపోతే మీ ఇండెంట్ ను తగ్గించి ఇతర సంస్థల ద్వారా సప్లై చేసుకోవాలా అని విజయ డెయిరీ ప్రతినిధులను మంత్రి సీతక్క ప్రశ్నించారు. మరో మూడు నెలల పాటు అవకాశం ఇస్తామని, పాల సరఫరా సంతృప్తికరంగా లేకపోతే ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. విజయ డెయిరీ రైతుల నుంచి పాలను సేకరిస్తుందని, అందుకే రైతుల ప్రయోజనాలు కాపా



డేందుకు విజయ డెయిరీ నుంచి పాలను కొనుగోలు చేస్తున్నామని గుర్తు చేసారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు తమకు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంరక్షణ అంతే ముఖ్యమని మంత్రి సీతక్క స్పష్టం చేసారు. అందుకే అంగన్ వాడీ కేంద్రాలకు జరిగే పాల సప్లై లో ఏలాంటి గ్యాప్స్ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. ఆరోగ్య తెలంగాణ, పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని, ఆ లక్ష్యాన్ని చేరుకునే దిశగా పనిచేయాలని ఆదేశించారు. అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే పాల నాణ్యతను స్వయంగా రుచి చూసి మంత్రి సీతక్క పరిశీలించారు. పాల నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్త పరిచారు. ప్రస్తుతం లీటర్ టెట్రా ప్యాక్ ను రూ. 57 కి విజయ డెయిరీ సరఫరా చేస్తుంది. ధరలను సవరించాలని విజయా డెయిరీ ప్రతిపాదించగా మంత్రి తిరస్కరించారు. మూడు నెలల పాటు ఏలాంటి గ్యాప్స్ లేకుండా పాలను సరఫరా చేసిన తర్వాత మరో సారి సమీక్షించి ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేసారు.

# పాలమూరు జనసంద్రం

## అభివృద్ధి నమూనా ఆవిష్కరించిన సీఎం

### రూ.14వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



**పాలమూరు ప్రతినిధి, మహా:** పాలమూరు జనసంద్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకంతో పాలమూరు రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి. ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలలో భాగంగా రైతు పండుగ ఆద్యంతం ఉత్సాహ భరితంగా సాగింది. మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో గత మూడు రోజులుగా రైతు పండుగ ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సహా మంత్రివర్గమంతా హాజరైంది. రూ.14వేల కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంఖుస్థాపన చేయడంతో పాటు ఎవడు అడ్డుపడ్డా పాలమూరు రూపురేఖలు మార్చి ప్రగతిపూలు పూయిస్తానని ప్రకటించారు.

ఈ పండుగ సందర్భంగా వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమ ఉత్పత్తులు, విత్తనాల రకాలు, సేద్యంలో వినియోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేయబడిన పరికరాలు, పనిముట్లతో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి గారు పరిశీలించారు. ఆధునిక పద్ధతుల్లో సేద్యం చేయడంపై రైతుల్లో అవగాహన పెంచడానికి ఏర్పాటు చేసిన ఈ స్టాళ్లతో పాటు ప్రదర్శనగా ఉంచిన వివిధ జాతులకు చెందిన పశువులు, గేదెల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదే సందర్భంగా ఒక్క ఏడాది... సాధించిన విజయాలెన్నో... పేరుతో పోస్టర్ ను ఆవిష్కరించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం ముందు సాగునీటి వెతలు తీరుస్తానని, ఐదేళ్ళలో లక్షకోట్లు ఖర్చుపెట్టి మనమే పాలమూరును మార్చుకుందామంటూ స్థానిక సెంటిమెంట్ రగిలించారు. మొత్తంగా సీఎం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సభ సక్సెస్ కావడం నేతలు, క్యాడర్ లో ఉత్సాహం నింపింది. తర్వాత సభ పెద్దపల్లి లో డిసెంబర్ 4న జరగనుంది.

# వణికిస్తున్న న్యూమోనియా

### నీలోఫర్‌కు చిన్న పిల్లలు క్యూ..
### జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు




**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 8 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. చల్ల గాలుల కారణంగా ఇబ్బందులు చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలపై న్యూమోనియా ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో హైదరాబాద్ నిలోఫర్ హాస్పిటల్‌కు చిన్న పిల్లలు క్యూ కడుతున్నారు. ఇప్పటికే దాదాపు 200 పైగా న్యూమోనియా కేసులు నీలోఫర్ హాస్పిటల్‌లో రికార్డయ్యాయి. ప్రతి రోజూ ఓపీకి 3040 మంది వస్తుండగా గడచిన మూడు నాలుగు రోజులుగా ఈ సంఖ్య 60 వరకు ఉంటోందని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు. వీరిలో కొందరికి హెచ్ఎఫ్ఎన్‌సీ, వెంటిలేటర్ చికిత్సలూ అవసరమవుతున్నాయని అంటున్నారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్‌కు కారణమయ్యే న్యూమోనియా బ్యాక్టీరియా, వైరస్, శిలీంధ్రాల వల్ల వ్యాప్తి చెందుతుందని డాక్టర్లు చెబుతున్నారు. 05 ఏళ్ల లోపు పిల్లలు, 65 ఏళ్లు పైబడి వృద్ధుల్లో ఈ న్యూమోనియా ఎక్కువ ప్రభావం చూపుతుందని అంటున్నారు. రెస్పిరేటరీ సిన్సిటియర్ వైరస్ (RSV), స్ట్రెప్టోకోకస్, ఇన్‌ఫ్లూయింజా వైరస్ న్యూమోనియాల బారిన ఎక్కువ మంది పడతారని చెబుతున్నారు.

చలి కాలంలో చిన్న పిల్లల ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని నిలోఫర్ డాక్టర్లు చెబుతున్నారు. న్యూమోనియా, ఆస్తమా, ఇతర బ్రీతింగ్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయని చెబుతున్నారు. 6 నెలల వరకు చంటి పిల్లలకు తల్లిపాలు తప్పక తాగించాలని సూచిస్తున్నారు. దీనివల్ల న్యూమోనియా వంటి ఇన్‌ఫెక్షన్లను నిరోధించవచ్చునని అంటున్నారు. అలాగే తీవ్ర జ్వరం, ఆయాసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శరీరం ఉన్నట్లుండి నీలం రంగులోకి మారడం లాంటి లక్షణాలు కన్పిస్తే నిర్లక్ష్యం చేయవద్దని చెబుతున్నారు. వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్లి డాక్టర్లను కలవాలని సూచిస్తున్నారు. ఈ కాలంలో చలి గాలుల బారిన పడకుండా ఉండాలని.. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే ఉన్ని దుస్తులు ధరించాలని అంటున్నారు. అలాగే వేడి వేడి ఆహారం తీసుకోవాలని.. గోరు వెచ్చని నీటిని మాత్రమే తాగించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

# నన్ను జైలుకు పంపండి

**హైదరాబాద్, మహా :** గురుకులాల కార్యదర్శిగా తాను పని చేసిన సమయంలో అవినీతి జరిగి ఉంటే ప్రభుత్వం విచారణ చేసి తనను జైలుకు పంపవచ్చని బీఆర్ఎస్ నేత, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ గురుకుల బాట పడతామంటే, సమస్యలు పరిష్కరించాల్సింది పోయి మతిస్తిమితం లేని నేతలు తనపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి కొండా సురేఖ స్థాయికి తాను దిగజారలేనని, వారికి మంత్రి పదవిలో ఉండే అర్హత లేదని ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. కుట్ర చేసి విషాహారం అని మాతృమూర్తిగా ఇలా మాట్లాడతారా? అని ప్రశ్నించిన ప్రవీణ్ కుమార్, వరంగల్‌లో కొండా కుటుంబం చేసిన అఘాయిత్యాలతో ఎన్నోకుటుంబాలు నాశనం అయ్యాయని ఆరోపించారు. నేర చరిత్ర పెట్టుకొని కొండా సురేఖ తమపై అభాండాలు వేస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మంత్రి సీతక్క మూలాలు మరచి మాట్లాడుతున్నారని ప్రవీణ్ కుమార్ ఆక్షేపించారు. తాను అవినీతి చేసినట్లు ఆధారాలు ఉంటే సీబీఐ విచారణ చేయించండని సవాల్ విసిరారు. గురుకులాలపై తాము కాదు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర చేశారని ఆరోపించారు.

కుట్ర ఎవరు చేస్తున్నారో బయటపెట్టాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా మారడం లేదని, చేతకాకపోతే విద్యా



శాఖను బీఆర్ఎస్‌కు అప్పగించాలని అన్నారు. కాంగ్రెస్‌కు రాష్ట్రాన్ని పరిపాలించే అర్హత లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. పిల్లల జీవితాలతో ఆడుకోవద్దని, రాజకీయాలు చేయవద్దని కోరారు. విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి గురుకులాలు, పాఠశాలలకు వెళ్లి చూస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. 50 మంది విద్యార్థులు చనిపోతే విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి ఒక్కరిని కూడా పరామర్శించలేదని ఆక్షేపించిన ఆయన, విద్యా కమిషన్ సీఎం రేవంత్ రెడ్డి ప్రొటెక్షన్ ఫోర్స్‌గా మారిందా? అని ప్రశ్నించారు. పిల్లలు పిట్టల్లా రాలుతుంటే విద్యా కమిషన్ ఎక్కడకు పోయిందని ఎద్దేవా చేశారు. గురుకులాల్లో సమస్యలపై అధ్యయనానికి వెళ్తున్నామని, ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా బీఆర్ఎస్వీ 8522044336 నంబర్‌కు పంపాలని సూచించారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో

# కీలక పరిణామం

- నిందితులకు షాకిచ్చిన కేంద్రం
- పాస్ పోర్టుల సస్పెండ్
- కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో ప్రభాకర్ రావు పిటిషన్
- ఇంటర్ పోల్ సహాయం కోరిన పోలీసులు

**హైదరాబాద్, మహా :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేసులో కీలక నిందితుడని దర్యాప్తు సంస్థ భావిస్తున్న మాజీ ఐజీ ప్రభాకర్ రావు అమెరికా ప్రభుత్వాన్ని శరణార్థిగా గుర్తించాలని అభ్యర్థన పెట్టుకోగా, ఆయన పాస్‌పోర్టును రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుకతో ఒక ఛానల్ ఎండీ శ్రవణ్ రావులు ప్రథమ ముద్దాయిలని దర్యాప్తు సంస్థ ఇప్పటికే పేర్కొంది. వీరిద్దరూ అమెరికా పారిపోవడంతో రప్పించేందుకు అనుసరించాల్సిన విధానాలపై రాష్ట్ర పోలీసులు ప్రధానంగా ఫోకస్ పెట్టారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఇంటలీజెన్స్ చీఫ్గా ప్రభాకర్ వ్యవహరించారు. ఈ కేసులో పోలీసులు అరెస్టు చేసి పలువురు పోలీసు అధికారులు విచారణలో ప్రభాకర్ రావు ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డట్లు వెల్లడించడంతో ఈ కేసు పురోగతిలో ప్రభాకర్ విచారణ, ఆయన ఇచ్చే సమాచారం ఆధారంగా దర్యాప్తు ముందుకు తీసుకు వెళ్ళేందుకు అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులు అమెరికాలోనే తిష్ట వేసి దర్యాప్తునకు సహకరించక పోవడంతో వీరిద్దరి పాస్ పోర్టును సస్పెండ్ చేయాలని రాష్ట్ర హోం శాఖ కేంద్రానికి లేఖ రాసింది. ఈ లేకను పరిగణనలోకి తీసుకుని హోం మంత్రిత్వ శాఖ ప్రభాకర్ రావుతో



పాటు శ్రవణ్ రావుల పాస్ పోర్టును సస్పెండ్ చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో హతాషులైన ఇద్దరు కీలక నిందితులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో పాస్ పోర్టు సస్పెండ్ ను సవాల్ చేశారు. ఈ మేరకు ప్రభాకర్ రావు న్యాయవాదులు పిటిషన్ ను దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలకులుగా ఉన్న ప్రభాకర్ రావు, శ్రవణ్ రావుల పాస్ పోర్టులను పూర్తిగా రద్దు చేయాలని రాష్ట్ర పోలీసులు మరోసారి సిఫారసు చేశారు. హోం మంత్రిత్వ శాఖతో సంప్రదింపులను జరుపుతూనే రాష్ట్ర పోలీసులు వీరిద్దరినీ రాష్ట్రానికి రప్పించేందుకు ఇంచర్ పోల్ సహాయాన్ని కోరారు. ఇద్దరిపై నమోదైన కేసులు, దర్యాప్తులో భాగంగా సేకరించిన వాంగ్మూలాలను ఇంటర్ పోల్ కు సమర్పించిన రాష్ట్రచ హోం మంత్రిత్వ శాఖ వీలైనంత తొందరగా ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను తమకు అప్పగించాలని కోరారు. ఇందుకోసం రెడ్ కార్నర్ నోటీసును జారీ చేయలని సూచించారు. దీంతో ఈ కేసు దర్యాప్తు మరింత రసవత్తరంగా మారింది. తనకు కేసుతోనే సంబంధం లేదని, ప్రభుత్వ నిధులలో ఉన్నప్పుడు అప్పటి పాలకులు చెప్పన పనిని చేశానని ఇప్పటికే ప్రభాకర్ రావు స్పష్టం చేయడంతోకేసు ఎక్కడ ఏ మలుపు తిరుగుతుందో తెలియని పరిస్థితులున్నాయి.

# హడలెత్తిస్తున్న పెద్దపులి

## మరో వ్యక్తిపై దాడి.. కొమురం భీం జిల్లాలో టెన్షన్ టెన్షన్..

### ఎవరూ బయటకు రావొద్దంటూ అధికారుల చాటింపు

### భయం గుప్పిట్లో ప్రజలు.. పులి జాడ కోసం రంగంలోకి అటవీ శాఖ బృందాలు

**కొమురంభీం, మహా :** కొమురంభీం జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. ఎప్పుడు ఎవరిపై దాడి జరుగుతుందోనని ప్రజలు భయంతో వణికిపోతున్నారు. రెండు రోజుల క్రితం కాగజ్ నగర్ పరిధిలో హైవే పక్కనే కనిపించిన పులి ఇప్పుడు పొలాలు, చేలల్లోకి వచ్చి మనుషులపై పంజా విసురుతోంది. శుక్రవారం ఉదయం లక్ష్మి అనే 21 ఏళ్ల మహిళపై పులి దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో పులిని పట్టుకునేందుకు ఫారెస్ట్ అధికారులు అడవిని జల్లెడ పడుతున్నారు.

**రైతుపై దాడితో..**


ఓవైపు పులికోసం వెతుకులాట మొదలుపెడితే మరోవైపు ఈ రోజు రైతుపై దాడి చేయడం ఆందోళన కలిగిస్తోంది. రైతుకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. కంది చేనులో పనిచేస్తుండగా పులి దాడి చేసినట్టు తెలుస్తోంది. వరుస ఘటనలతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. బయటకు రావాలంటేనే బయపడి పోతున్నారు. గ్రామాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని



పొలాల్లోకి, చేనుల్లోకి వెళ్లవద్దని అధికారులు డబ్బు చాటింపు చేస్తున్నారు. కాగజ్ నగర్ మండలంలోని ఈజ్గాం, విలేజ్ నంబర్ 1,3,5,8,9,10 గ్రామాలలో కడంబా, ఆరెగూడ, గన్నారం, సీతాగూడ గ్రామాలలో ప్రజలు బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ గ్రామాలలో 144 సెక్షన్ విధించారు. మరోవైపు అటవీ అధికారులు డ్రోన్ సహాయంతో పులిని పట్టుకునే పనిలో ఉన్నారు. కానీ పులి మాత్రం తప్పించుకుని తిరుగుతోంది.

## మహారాష్ట్ర నుంచి పులుల రాక..

ఇదిలా ఉంటే కాగజ్ నగర్ అడవుల్లోకి పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి పులులు రాకపోకలు సాగిస్తున్నాయి. గడ్చిరోలి అడవుల్లో నుంచి జిల్లాలోకి పులులు రాగా కడంబా అడవిలో గతంలో పులిపిల్లలు చేసింది. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో పులుల సంచారం పెరిగింది. కాగజ్ నగర్ తో పాటూ గతంలో జిల్లాలోని దెహెగాం వద్ద కూడా ఓ యువకుడిపై దాడి చేసి పులి చంపేసింది. వరుస ఘటనలు జరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు మాత్రం తగిన చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



## తెలంగాణలో తగ్గిన నిరుద్యోగం

### కేంద్ర ప్రభుత్వ నివేదిక

**హైదరాబాద్, మహా:** గత ఏడాదితో పోలిస్తే తెలంగాణలో నిరుద్యోగం తగ్గుముఖం పట్టిందని కేంద్రప్రభుత్వ నివేదిక వెల్లడించింది. తెలంగాణలో నిరుద్యోగం తగ్గి ఉద్యోగాలు పెరుగుతున్నాయని పేర్కొంది. 2023 జులై సెప్టెంబర్ లో తెలంగాణలో నిరుద్యోగం 22.9% ఉండగా, 2024 జులై సెప్టెంబర్ లో తెలంగాణలో నిరుద్యోగం 18.1% మాత్రమే ఉందని, గత ఆరు నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో భారీగా ఉద్యోగ అవకాశాలు పెరిగాయని కేంద్ర ప్రభుత్వ నివేదికలో పేర్కొంది.

EDITORIAL ఎడిటోరియల్

# మార్పుకు ఏడాది

**తెలంగాణ ప్రభుత్వం రైతుపండుగ జరుపుతోంది. ఏడాదిపాలనపై రైతులు సంతృప్తిగా ఉన్నారా? అన్న ప్రశ్నలకు అసంతృప్తిగా ఉంటే రైతులు ఊరుకోరు కదా అని కొందరు మంత్రులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏడాదికాలంలో నియామకాల ద్వారా నిరుద్యోగుల విశ్వాసం పొందిన ప్రభుత్వం రైతులకు మరింత చేయాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహారాష్ట్ర ఫలితాల తర్వాత ఇటీవల ప్రధాని మోడీ తెలంగాణ బిజెపి నేతలతో సమావేశమయ్యారు. తెలంగాణపై తమ చూపు ఉందన్న సంకేతాన్ని ఈ భేటీ ద్వారా ప్రధాని పంపారు. త్వరలో బిజెపి నూతన అధ్యక్షుని నియామకం కూడా జరగనున్నది. ఆ తర్వాత తెలంగాణ పొలిటికల్ పిక్చర్ లోకి కొత్త పాత్రలు వచ్చే అవకాశం కనబడుతోంది.**

*- ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్*


కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

ఏడాది క్రితం సరిగ్గా ఇదే రోజు...పొలానికి వెళ్లి అరక కట్టాల్సిన రైతు...పోలింగ్ బూతుకు వెళ్లి మార్పు కోసం ఓటేశాడు.

ఆ ఓటు అభయహస్తమై...రైతన్న చరిత్రను తిరగరాసింది. ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ, రూ.7,625 కోట్ల రైతు భరోసా, ధాన్యానికి క్వింటాల్ కు రూ.500 బోనస్ తో పాటు ఒక్క ఏడాదిలో రూ.10,547 కోట్ల ధాన్యం కొనుగోళ్లతో ఏడాదిలోనే 54వేల కోట్ల రూపాయలతో రైతుల జీవితాల్లో పండగ తెచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఓ వైపు రైతు పండుగ జరుగుతున్న వేళ రైతులంతా సంతృప్తిగా ఉన్నారా? అంటే అసంతృప్తిగా ఉంటే వారు మమ్మల్ని తిరగనీయరు కదా అని మంత్రులు అంటున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండాయి. సన్నాలకు బోనస్ సంతోషపరిచింది. దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రీ చేయని సాహసం చేసి ఒకేసారి 17వేల కోట్ల కు పైగా చెల్లింపులు చేస్తే ఆశించిన మైలేజీ రాకపోగా.. గ్రామాల్లో కల్లోలం రేగడం ఏమిటి? ఆయా మంత్రిత్వశాఖల్లో నిర్లక్ష్యానికి నిదర్శనం కాదా? ముఖ్యమంత్రి నిర్విరామంగా పనిచేస్తున్నాడు. మనకెందుకులే అన్నట్లుగా కొందరు పెద్దలు అంటీముట్టనట్లుగా వ్యవహరించడం వల్లే పని జరుగుతున్నా ఫలితాలు ప్రతిపక్షాల విమర్శల్లో.. సోషల్ మీడియా దాడిలో కొట్టుకుపోతున్నాయి. అపుడపుడూ కొన్ని స్టేట్ మెంట్లు చూస్తుంటాం. మేం చేసిన అభివృద్ధి చెప్పుకోలేకపోయాం అని. చేతులు కాలాక నాయకుల నుండి వచ్చే నిర్వేదం ఇది. కాలుతున్న వాసన వస్తున్నపుడే కావాలి అప్రమత్తం.

తెలంగాణ ప్రభుత్వ ఏడాదిపాలనలో ఉద్యోగాల కల్పనలో ముందడుగు పడింది. సామాన్యులైనా, సంఘాలైనా తమ గోడుచెప్పుకునే వేదిక, విని పాటించే ప్రభుత్వం దొరికింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకు 18గంటలకు పైగా కష్టపడుతున్నారు. రైతు సాగులో సవ్య సాచే . రాబడి పద్మ వ్యూహం లో మాత్రం అభిమన్యుడు అన్న అభిప్రాయం మార్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం పని చేస్తోంది. రైతుపండుగతో రైతుల సంతృప్త స్థాయిని పెంచుతుందా? ప్రజావిజయోత్సవాలతో సర్కారు మైలేజ్ పెరుగుతుందా చూడాలి. నిరుద్యోగుల్లో నమ్మకం కలిగించిన ప్రభుత్వం రైతుల్లో మరింత నమ్మకం పెంపొందించుకునేలా చర్యలు చేపట్టాలి.

తెలంగాణ నేతలతో ప్రధాని నరేంద్రమోడీ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణలో 8మంది ఎమ్మెల్యేలు, 8మంది ఎంపీలు ఉన్న బిజెపి భవిష్యత్తులో రాష్ట్రంలో అధికారంలోకి రావడం సాధ్యమే అని భావిస్తోంది. ఈ క్రమంలో తమ చూపు ఉందన్న సంకేతాలిచ్చేందుకు మోడీ కీలక భేటీ నిర్వహించారు. తర్వాత దీనిపై తెలుగులో ట్వీట్ కూడా చేశారు. ఈ సమావేశం నుండి అందాల్సిన వారికి సంకేతాలు అందాయి. ఇటు సీఎం రేవంత్, అటు మాజీ సీఎం కేసీఆర్ మోడీ వ్యూహం అర్థం చేసుకుని ఆకళింపు చేసుకున్నారు. గత ఐదుమాసాలుగా తెలంగాణలో బిజెపి గ్రాఫ్ పై హైకమాండ్ అంత సంతృప్తిగా లేదు. దీనికి అనేక కారణాలున్నాయి. త్వరలోనే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి నియామకం జరగనున్నది. ఆ తర్వాత పుంజుకుంటుందేమో చూడాలి. ఓటమి తర్వాత యాక్టివ్ అయిన బిఆర్ఎస్ ఫలితాలతో సంబంధం లేకుండా దీక్షాదివాస్ దాకా పరుగెడుతూనే ఉంది. జనసేనాని పవన్ కల్యాణ్ సామర్థ్యంపై ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు సంతోషంగా ఉన్నారు. మీతో జాతీయ రాజకీయాల్లో పని ఉంది.. రమ్మని ఆహ్వానించినా పవన్ ససేమిరా అంటున్నారు. ఎన్డీఏ భాగస్వామిగా, మోడీ ప్రేమికునిగా ఎక్కడ ప్రచారానికైనా సిద్ధం.. కానీ ఏపికి కాలేను దూరం అని పవన్ స్పష్టం చేశాడంట. త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో నాగబాబు ను నిలపాలని జనసేన నిర్ణయించింది. అయితే బిజెపి హైకమాండ్ మాత్రం మీరు కేంద్ర మంత్రిగా ఉండి.. సోదరుడు నాగబాబును అసెంబ్లీకి పంపితే ఎలా ఉంటుందని ప్రతిపాదన ముందు పెట్టిందని సమాచారం. అయితే ఎపి ప్రజలు తనపై ఎంతో నమ్మకంగా ఉన్నారని, ఆ నమ్మకం నిలుపుకునేలా తాను చాలా పనిచేయాల్సిఉందని పవన్ కల్యాణ్ కుండబద్దలు కొట్టేసినట్లు చెబుతున్నారు. ఎపి, మహారాష్ట్ర విజయాలే కాకుండా పవన్ చేపట్టిన సనాతన ధర్మదీక్ష జాతీయస్థాయిలో ఆయనకు మంచి మైలేజీ తీసుకుంది. అదే బిజెపి మనసుకు దగ్గర చేసింది. చేగువెరా సిద్ధాంతం నుండి సనాతన ధర్మ రక్షణ దాకా తాను దేనిని నమ్మినా, ఆ సిద్ధాంతానికి తానే ప్రతీకలా ఒదిగిపోవడం, ప్రజలను మెప్పించడం పవన్ కు మాత్రమే సాధ్యం. పవన్ పట్టుదల, వ్యూహరచన, సామర్థ్యం పనితీరు చూస్తే.. ఆయన వేగంగా శిఖరాగ్రానికి చేరుకుంటాడని జాతీయ మీడియాలోనూ విశ్లేషణలు వస్తున్నాయి. రాజకీయాలు ఎలా ఉన్నా అధికారంలోకి వచ్చాక పవన్ తనను తాను మలుచుకుంటున్న తీరు సుదీర్ఘప్రయాణాన్ని సూచిస్తున్నది.

**- వీకెండ్ అనాలసిస్ బై కేఆర్ ఆర్**




# ఆదివారం ఈ అంగట్లో స్వెటర్లు అగ్గువా

## మంకీ క్యాప్స్, మఫ్లర్స్ కూడా అవైలబుల్

### ఏది కొన్నా ధర తక్కువే.. సండేస్ మాత్రమే ఈ ఆఫర్

**హైదరాబాద్, మహా:** ప్రస్తుతం చలికాలం కావడంతో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలోనే వారు చలి నుంచి తమను తాము కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలు తీసుకుంటున్నారు. ఉన్ని దుస్తువులు, స్వెటర్లు, మంకీ క్యాప్ లు, మఫ్లర్లు ధరిస్తూ వెచ్చదనంఽపొందుతున్నారు. అయితే, ప్రతి సారి లాగా ఈసారి కూడా స్వెటర్లు, మంకీ క్యాప్స్, మఫ్లర్స్ వాడే వారి సంఖ్య పెరిగింది. వాటి గిరాకీ పెరిగింది. ఇవి కొంత కాస్ట్లీ ఉండడంతో సామాన్య ప్రజలు కొనలేకపోతుంటారు. వారు షాపింగ్ మాల్స్ లోకి వెళ్లి వాటిని కొనుగోలు చేయలేకపోతుంటారు. దీంతో వారు తక్కువ ధరలో ఈ స్వెటర్లు ఎక్కడ దొరుకుతాయిని ఆలోచిస్తుంటారు. అయితే, స్వెటర్లు, బ్లాంకెట్స్, మఫ్లర్స్, మంకీ క్యాప్ లు.. ఇలా అన్ని దస్తువులు ఒకచోట దొరికే మార్కెట్ నగరంలో ఉంది. ధర కూడా చాలా తక్కువగా ఉంటుంది. అంతేకాదు.. ఈ దుస్తువులే కాదు.. ఇతర ఎన్నోవస్తువులు కూడా ఇక్కడ లభ్యమైతాయి. అందుకే వేల సంఖ్యలో కస్టమర్లు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. దీంతో అక్కడ జాతరను తలపిస్తుంటుంది వాతావరణం. ఇదంతా ప్రతిరోజూ కాదు.. కేవలం ఆదివారం ఒక్క రోజు మాత్రమే. మరి ఇవన్ని లభ్యమయ్యే చోటు ఎక్కడంటారా..? అదే ఎర్రగడ్డ మార్కెట్. ఇది కేవలం ఆదివారం మాత్రమే కొనసాగుతుంది. తెల్లతెల్లవారుజామున మొదలవుతుంది ఈ సంత. ఈ అంగట్లో ఏ వస్తువు కావాలన్నా కూడా లభ్యమవుతుంది. కిలో మీటర్ల మేరా ఇక్కడ సంత కొనసాగుతుంది. వెయ్యిందికి పైగా చిరువ్యాపారులు రకరకాల వస్తువులను విక్రయిస్తుంటారు. ఈ సంత అంతా కూడా రోడ్డు మీదనే కొనసాగుతుంది. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు చేరి గూడారాలుగా, తోపుడు బండ్లపై వస్తువులను విక్రయిస్తుంటారు.



#### సందడి సందడిగా...

ఈ సంత శతాబ్ధ కాలం నాటిదని చెబుతుంటారు. ఎర్రగడ్డ చౌరస్తా నుంచి సనత్ నగర్ బస్టాండ్ వరకు ఆదివారం అంగడి కొనసాగుతుంది. ఈ సంతలో దస్తువులతోపాటు మిగతా వస్తువులను కూడా అమ్ముతుంటారు. ఇంట్లో అవసరమయ్యే ప్రతి వస్తువు ఇక్కడ విక్రయిస్తారు. స్క్రూడ్రైవర్ నుంచి సూట్ కేస్ వరకు, బొమ్మలు, స్మార్ట్ ఫోన్లు.. ఇలా ప్రతిదీ ఇక్కడ విక్రయిస్తుంటారు. దీంతో ప్రతి ఆదివారం ఈ ఎర్రగడ్డ మార్కెట్ కు ఇసుకేస్తే రాలనంత జనాలు వస్తుంటారు. నగర వ్యాప్తంగానే కాదు.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి తమకు కావాల్సిన వస్తువులను కొనుక్కుని వెళ్తుంటారు. దీంతో సండే రోజు ఈ మార్కెట్ జనాలతో సందడి సందడిగా ఉంటుంది.

#### సీజన్‌కు తగ్గట్టుగా దుస్తువులు...

ముఖ్యంగా దుస్తువుల విషయానికి వస్తే ఈ మార్కెట్ లో సీజన్ కు తగ్గట్టుగా విక్రయిస్తుంటారు. ఎండకాలంలో కాటన్ దుస్తువులను విక్రయిస్తుంటారు. వర్షా కాలంలో రెయిన్ కోట్లు, గొడుగులు అమ్ముతుంటారు. ఇక చలికాలంలో కూడా స్వెటర్లు, మంకీ క్యాప్ లు, షాల్స్, మఫ్లర్స్.. ఇలా సీజన్ బట్టి విక్రయిస్తుంటారు. ప్యాంట్, షర్ట్స్.. ఇలా మిగతా దుస్తువులు సీజన్ తో సంబంధం లేకుండా ప్రతిఆదివారం విక్రయిస్తుంటారు. అయితే, ఇక్కడ చాలా తక్కువ ధరకే విక్రయిస్తుంటుంటారు. వాటి నాణ్యత కూడా బాగానే ఉంటుందని రెగ్యులర్ కస్టమర్లు చెబుతుంటారు. కాకపోతే వాటిని కొనుక్కునేటప్పుడే చూసి తీసుకోవాలని సలహా ఇస్తుంటారు.

# జామ ఆకులతో యవ్వనం

**మహా:** ప్రస్తుతం బిజీబిజీ జీవితంలో అనారోగ్యాలు దరిచేరుతున్నాయి. రకరకాల రోగాలతో జనాలు బాధపడుతున్నారు. ఆనాటి రోజుల్లో ప్రకృతిని నమ్ముకుని మనిషి జీవించేవాడు. తనకు ఏది కావాలన్నా ప్రకృతిపైనే ఎక్కువగా ఆధారపడేవారు. ప్రకృతిలో దొరికే వృక్షాలు, పండ్లను తినడమే కాదు.. వాటి ఆకులు కూడా ఎంతో ఉపయోగపడుతాయి. వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో ఆ విధంగా ఉపయోగించుకునేవారు నాటి రోజుల్లో. కానీ, ప్రస్తుతం చాలామందికి ఈ విషయాలేవీ తెలియడంలేదు. అందులో ఒకటి జామ ఆకు. ఈ ఆకు గురించి చాలా మందికి తెలియదు. దీంతో జామ పండ్లను మాత్రమే తింటుంటారు. వాటి ఆకులను పడేస్తుంటారు. కానీ, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు తెలిస్తే నిజంగా ఆశ్చర్యపోతారు. ఇందుకు సంబంధించి పలువురు నిపుణులు చెప్పినదాని ప్రకారం.. మొదటగా జామ ఆకులను తీసుకోవాలి. వాటిని శుభ్రంగా కడగాలి. ఆ తరువాత వాటిని నీటిలో పది నిమిషాలపాటు మరిగించాలి. ఆ తరువాత ఆ నీటిని వడకట్టి అందులో కొద్దిగా నిమ్మరసం, తేనేను యాడ్ చేయాలి. అలా కలిపిన తరువాత ఆ నీటిని తాగాలి. ఇలా తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. మీరు నిత్యం యవ్వనంగా కనిపిస్తారు. ముఖం మీద మొటిమలు, మచ్చలు మటుమాయమైపోతాయి. ఫేస్, శరీరం ఎప్పుడూ మెరుస్తూ కనిపిస్తుంది. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ విషయంలో కూడా జామ ఆకులు కీలక పాత్ర పోషిస్తాయి. పూర్తిగా తగ్గుతుంది. కడుపు నొప్పి, నడుం నొప్పిని కూడా తగ్గిస్తాయి. పలు రోగాలను కూడా జామ ఆకులు నయం చేయడంలోనూ హెల్ప్ అవుతాయని నిపుణులు చెబుతున్నారు.





# మహా పీఠంపై ఎందుకింత సందిగ్ధత ..?

మహారాష్ట్ర ముఖ్యమంత్రి పీఠం ఎవరికి కట్టబెట్టాలన్న నిర్ణయానికి ఇంకా మహాయుతి కూటమి రాక పోవడం సర్వత్రా చర్చనీయాంశమయ్యింది. ఫలితాలు వెలువడి వారం రోజులు గడిచినా ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై ఇప్పటి వరకు ఎలాంటి క్లారిటీ లేదు. దీంతో పాటే ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడిన జార్ఖండ్ లో హేమంత్ సోరెన్ సీయంగా ప్రమాణ స్వీకారం కూడా చేసారు.కాని ఇక్కడ మహారాష్ట్రలో మాత్రం ముఖ్యమంత్రి ఎవరన్న విషయంలో తర్జన భర్జన జరుగుతోంది. మాజీ ముఖ్యమంత్రి బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవిస్ పేరే వినిపిస్తున్నా అధికార బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి ఇంకా ఫైనల్ చేయలేదు.

నిన్న రాత్రి హోంమంత్రి అమిత్ షా నివాసంలో దాదాపు రెండుగంటల కు పైగా జరిగిన సమావేశంపైనే అందరి దృష్టి. తొలుత మహారాష్ట్ర అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే తో అమిత్ షా , జేపీ నడ్డా అరగంట పాటు జరిపిన చర్చలు ,అనంతరం అజిత్ పవార్, షిండే, దేవేంద్ర ఫడ్నవీస్, సునీల్ తట్కరే లతో రెండు గంటల సమావేశ సారాంశం విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం దేవేంద్ర ఫడ్నవిస్ కు సీయం ,ఏక్ నాథ్ షిండే , అజిత్ పవార్ లకు డిప్యూటీ సీయం పదవులు . రాజకీయ పరిజ్ఞానం ఉన్నఅందరూ దాదాపు ఊహించిందే..ఛానళ్లు , వార్తా పత్రికలు , సామాజిక మాధ్యమాల్లో దాదాపు ఊదర గొట్టినవే. ఇందులో కొత్తగా ఆలోచించడానికి ఏముంటుందన్నది విశ్లేషకుల అభిప్రాయం . ఇందుకోసం ఎందుకింత సాగదీత అని రాజకీయ విశ్లేషకులతో పాటు మహా రాష్ట్ర ప్రజలు కూడా భావిస్తుండవచ్చు. సీయం పదవి అంటే మామూలు విషయం కాదు. ఆ పదవిని ఆశించే ఆశావహులు ఒకరిద్దరు ఉన్నప్పుడు ఈమాత్రం సాగదీత అవసరమేనని ఇది కూడా బీజేపీ స్ట్రాటజీలో ఒక భాగమేనని అభిప్రాయ పడేవారు ఉన్నారు.రెండు రోజులు సైలెంట్ గా ఉంటే మీడియా , ప్రజలు ఫలానా వారు సీయం ఫలాన వారు ఇది ,అది అని బయట చర్చల్లో సోషల్, మీడియాలో ముందే ప్రచారం చేసేయడం అది పబ్లిక్ లోకి వెళ్లడం అవే పేర్లను అటూ ఇటూగా దాదాపు అధిష్టానం ఫైనల్ చేస్తే ఇటు మిత్ర పక్షాల్లో కావచ్చు అటు ప్రజల్లో కావచ్చు పెద్దగా చర్చకు దారి తీయవన్నది తద్వారా ఎలాంటి కుంపట్లు రాజుకునే అవకాశం ఉండక పోవచ్చన్నది కూడా ఆ పార్టీ వ్యూహంగా చెప్పుకోవచ్చన్నది పలువురి అభిప్రాయం. కాకపోతే ముందే పిలిపించి అంతా వివరించి సర్దిచెప్పడమనేది ఏ కూటమి పార్టీ అయినా చేసేదే. 280 అసెంబ్లీ సీట్లున్న మహారాష్ట్ర లో బీజేపీ 149 స్థానాల్లో పోటీ చేసి 132 సీట్లతో మహాయుతి కూటమిలో అతిపెద్ద పార్టీగా అవతరించగా, దాని మిత్రపక్షాలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 57, అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్‌సీపీ 41 సీట్లు గెలుచుకున్నాయి.149 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ ఒక వేళ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 145 స్థానాల్లో గెలిస్తే పరిస్థితి వేరుగా ఉండేదని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి కావల్సిన 13 సీట్ల కంటే చాలా ఎక్కువగా మిత్ర పక్షాలు సాధించాయి. దీంతో వ్యూహ రచనలో దిట్ట అయిన బీజేపీ ఆచితూచి నిర్ణయం తీసుకుంటుదనేది మరి కొందరి మాట.2019 లో శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ఝలకివ్వడంతో అధికారం తారుమారై తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో శివసేన లో చీలికలు చివరికి యూపీఏ మిత్రపక్షం ఎన్సీపీ కూడా రెండు ముక్కలైన పరిస్థితి. అలాంటి సిచ్యుయేషన్ ప్రస్తుతానికి లేక పోయినప్పటికి.. ఏర్పడబోయే మహాయుతి ప్రభుత్వానికి ప్రమాదమేమీ ఊహించక పోయినప్పటికి రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వం శాశ్వత మిత్రుత్వం ఉండదన్న నానుడి చూస్తే ఏదైనా సాధ్యమనే భావన మాత్రం సహజం . అందుకే మహాయుతి కూటమిలోని అతిపెద్ద పార్టీ బీజేపీ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటోందని అందుకే ఇంత సందిగ్ధత అన్నది విశ్లేషకుల అభిప్రాయం.


- సత్యనారాయణ రావు, జర్నలిస్ట్

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999

ANN తెలుగు

# మహా పత్రిక

05

ఆదివారం, హైదరాబాద్ | 01-12-2024 | జిల్లాల వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM


## చారిత్రాత్మక ప్రదేశాల వద్ద సుందరీకరణ పనులు

### కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలు



**నిర్మల్ మహా :** జిల్లాలోని పలు చారిత్రాత్మక ప్రదేశాలను దశలవారీగా అభివృద్ధి చేయాలని , పర్యాటకులను ఆకర్షించే విధంగా సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని శ్యామ్ ఘడ్ కోట, ధర్మసాగర్ చెరువు (మినీ ట్యాంక్ బండ్) ను ఆమె అధికారులతో కలిసి సందర్శించారు. శ్యామ్ ఘడ్ కోట వద్ద చేపట్టనున్న ఫుట్ పాత్, రోడ్డు వెడల్పు, విద్యుత్ దీపాల ఏర్పాటు పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పురాతన కట్టడాల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. చారిత్రాత్మక ప్రదేశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.. హైమస్ లైట్లను ఏర్పాటు చేసి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చూడాలన్నారు. మినీ ట్యాంక్ బండ్ ను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మురికినీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్ కు స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలలో నిరంతరం మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ హరిభువన్, నిర్మల్ అర్బన్ తహసిల్దార్ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మరోసారి మొండి చెయ్యే చూపారు

### అసెంబ్లీకి వచ్చేందుకు మేం రెడీ.. మైక్ కట్ చేయకుండా సమయం కేటాయిస్తారా?.. మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి ఫైరయ్యారు. మహబూబ్ నగర్ లోని నిర్వహించిన రైతు పండుగలో రేవంత్ రెడ్డి సహా మంత్రులు ఎంత మొత్తుకున్నా దండుగే అయ్యిందని, ఆడంబరంగా నిర్వహించిన కార్యక్రమం యావత్ తెలంగాణ రైతాంగాన్ని ఉసూరు మనిపించిందన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మాట్లాడుతూ.. ఏడాది పూర్తయిన సందర్భంగానైనా రైతులందరికీ రుణమాఫీ, వానాకాలంతోపాటు ఈ యాసంగికి ఇచ్చే రైతు భరోసా మొత్తం కలుపుకొని ఎకరాకు రూ. 15 వేలు ప్రకటిస్తారనుకుంటే మరోసారి మొండి చెయ్యే చూపారన్నారు. రైతు పండుగ పేరుతో రేవంత్ రెడ్డి రైతులను మాయమాటలతో మరోసారి మోసం చేశారని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ ప్రారంభించిన రైతు బీమా పథకాన్ని కూడా కాంగ్రెస్ పేటెంటే అంటూ గప్పాలు కొట్టుకోవడం సిగ్గుచేటన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగం చూస్తే రైతుల పట్ల ప్రేమ కంటే, గిరిజనుల నుంచి భూసేకరణ చేయడంలో ఘోరంగా విఫలమయ్యామనే ఆవేదనే కనిపించిందన్నారు. పాలమూరు సభ సాక్షిగా రైతులను బెదిరిస్తున్నావు..పాలమూరు బిడ్డగా ఇది మీకు న్యాయమా రేవంత్ రెడ్డి? అంటూ ప్రశ్నించారు. రుణమాఫీ లెక్కనే పాలమూరు అభివృద్ధి హామీ ఉంటదేమో అంటూ ఆయన ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ కు గజ్వేల్ లో వెయ్యి ఎకరాల ఫాం హౌజ్ ఉన్నట్లు అబద్ధాలు మాట్లాడం కాదు. నిరూపించేందుకు సిద్ధమా రేవంత్ రెడ్డి ? నిరూపించకుంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తవా?. అసెంబ్లీకి రా కేసీఆర్ అంటూ పదే పదే అంటున్నావ్. మేం కూడా అదే సమయం కోసం ఎదురు చూస్తున్నాం. మీ ఏడాది పాలనలో అన్ని వర్గాలను ఏడిపించడమే తప్ప ప్రజలకు చేసిందేమీలేదు. అసెంబ్లీలో మీ ఏడాది పాలన అసలు రంగు బయటపెట్టేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీలో మైకులు కట్ చేయకుండా సమయం కేటాయించే దమ్ము మీకుందా?' అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు.

## కల్లుగీత కార్మిక సంఘ సదస్సులో పాల్గొన్న బబ్బూరి శ్రీకాంత్ గౌడ్

### శ్రీకాంత్ గౌడ్ ను సత్కరించిన కేజీకేఎస్ రాష్ట్ర నాయకత్వం




**పాలకుర్తి /దేవరుప్పుల 30 మహా :** జనగామ జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్లో కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ హాజరై మాట్లాడుతూ కల్లుగీత సంఘం 67 వార్షికోత్సవం జరుపుకోవడం శుభపరిణామం అని, సంఘం నాయకులు అంతా ఒకే తాటిపై ఉండి కార్మికుల హక్కుల కోసం పోరాడాలని సూచించారు. కార్మికుల హక్కుల కోసం సంఘ అభ్యున్నతికి కృషి చేస్తున్న సంఘ నాయకులను శ్రీకాంత్ గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ను కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకత్వం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, గీత కార్మికులు పాల్గొన్నారు.

## ఏపీకి ఐఎండీ బిగ్ అలర్ట్

### ఫ్లాష్ ఫ్లడ్స్ హెచ్చరికలు

**చెన్నైకి 190 కి.మీ ల దూరంలో కేంద్రీకృతమైన ఫెంగల్ తుఫాన్**



**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ కు ఐఎండీ కీలక అలర్ట్ ఇచ్చింది. ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో ఫ్లాష్ ఫ్లడ్ కు అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కొన్నిచోట్ల అతి తీవ్ర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి బంగాళాఖాతంలో 'ఫెంగల్ ' తుపాన్ కొనసాగుతోంది. గడిచిన 6 గంటల్లో గంటకు 7 కిమీ వేగంతో కదులుతుందని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతానికి పుదుచ్చేరికి 180 కి.మీ, చెన్నైకి 190 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని తాజా బులెటిన్ లో వివరించింది. ఈ ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కొన్నిచోట్ల అతి తీవ్ర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడుతాయని అంచనా వేసింది. తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల తీరం వెంబడి 7090 కిమీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. ఇక ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో ఫ్లాష్ ఫ్లడ్ కు అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. ఆకస్మిక వరదల పట్ల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది.

### తెలంగాణలోనూ వర్షా లు - హెచ్చరికలు జారీ

తెలంగాణకు కూడా ఐఎండీ అలర్ట్ ఇచ్చింది. శనివారం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షా లు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. భారీ వర్షా ల నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలు ఆయా జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాయి. పంట చేతికి వచ్చి చాలా చోట్ల ధాన్యం కల్లాలలో ఉన్నందున ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని, ఆయా ప్రాంతాలలో రైతులను అప్రమత్తం చేయాలని ఆదేశించాయి.



## మందమర్రిలో ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి పుట్టినరోజు వేడుకలు

**మంచిర్యాల మహా :** మందమర్రి పట్టణంలో ప్రధాన రహదారి కూడలి వద్ద బండి సదానందం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.కేక్ కట్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి సదానందం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల నాయకుడిగా పేదల పెన్నిధిగా,గడ్డం వివేక్, ఆయన తనయుడు పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ నిలిచారని అన్నారు. పేదల కోసం తపించే నాయకులని అభివర్ణించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో అనేక పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఎంతో కృషి చేశారని చెప్పారు.చెన్నూరు నియోజకవర్గానికి 1000 కోట్ల నిధులు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే వివేక్ దని అన్నారు.ఈసందర్భంగా మున్సిపల్ కార్మికులకు పేదలకు బ్లాంకెట్లు అందజేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసారు.

## మందమర్రిలో ఘనంగా కార్తీక దీపోత్సవం

### పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం



**మంచిర్యాల మహా :** మందమర్రి పట్టణంలోని మూడవ జోన్ ఏరియాలో గల సీతారామచంద్ర స్వామి కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో అత్యంత వైభవోపేతంగా కార్తీక దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు అచి వెంకటాచార్యులు ఆచి వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాలు నడుమ పార్వతి పరమేశ్వరుల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు.అధిక సంఖ్యలో హాజరైన భక్తులు కళ్యాణాన్ని తిలకించి తరించారు.కార్తీక దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసారు. వారికి అండగా సేవా సమితి సభ్యులు సహకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దంపతులు మందమర్రి ఏరియా జిఎం దేవేందర్ దంపతులు డివై ఎస్పి జయప్రకాష్ సింగరేణి అధికారులు నాయకులు భక్తులు పాల్గొన్నారు.

## పది నెలల్లో రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు-ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



**మంచిర్యాల మహా :** అధికారంలోకి వచ్చిన పదినెలల కాలంలోనే రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు పండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొన్కల్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులతో కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్న తరుణంలో గడిచిన పదినెలల్లో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహించిందని పేర్కొన్నారు. వాటిని రైతులకు వివరిస్తూ ప్రతిపక్షాల వాదనలకు తెరదింపేందుకు రైతు సదస్సు ను కనీవినీ ఎరుగని రీతిలో మహబూబ్ నగర్ జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని రైతు వేదికలలో ఉన్న 566 వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ద్వారా రైతులంతా దీన్ని వీక్షించేలా టెలికాస్ట్ చేయడం జరిగిందని పేర్కొన్నారు.

## సాదాసీదాగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం



**ఆదిలాబాద్, మహా :** మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది.8 ఎజెండా అంశాలు ప్రవేశపెట్టి సభ్యులు చర్చ సాగించారు. చాలా రోజులుగా వార్డులోని పలు కాలనీలో మిషన్ భగీరథ నీరు రావడంలేదని , సంబంధిత అధికారులు నీరు వచ్చేటట్టు చూడాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ బండారి సతీష్ కోరారు. అదేవిధంగా పట్టణంలో వివిధ స్థలాలలో ఉన్న మున్సిపల్ షాపుల బహిరంగ వేలం చాలా రోజులుగా పెండింగ్ లో ఉంచడం వలన మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుందన్నారు. కాబట్టి వెంటనే షాపులను వేలం చేయాలని సూచించారు. ప్రధాన కూడళ్లతోపాటు చాలాచోట్ల స్ట్రీట్ లైట్లు వెలగక కారు చీకట్లు కమ్ముకుంటున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు.ఇంకా అనేక సమస్యలను సభ్యులు లేవనెత్తారు. అటు పట్టణం నడిబొడ్డున మహేశ్వర్ థియేటర్ సమీపంలో మున్సిపల్ ల్యాండ్‌లో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయాలంటూ తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలపలేదు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండుగను వీక్షించిన బోథ్ కాంగ్రెస్ నాయకులు



**ఆదిలాబాద్ మహా :** ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్‌లో పాల్గొన్న రైతు పండగ కార్యక్రమంపై వ్యవసాయ అధికారులు బోథ్ మండల కేంద్రంలోని రైతువేదికలో సీఎం కార్యక్రమాన్ని రైతులు వీక్షించడానికి వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో, 10 నెలల్లో కాంగ్రెస్ సర్కార్ ఏం చేసిందో లెక్కలతో సహా చెబుతామన్నారు. రుణమాఫీ, రైతు భరోసాకి సంబంధించి రైతులకు సీఎం తీపి కబురు అందించనున్నారని, సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన దాదాపు 3 లక్షల మంది రైతులకు రూ.3 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఈ విడతలో అందించనుందని రెండు లక్షల పైన ఋణం ఉన్న రైతులు అధైర్య పడకండని ఖచ్చితంగా రాబోయే రోజుల్లో ప్రభుత్వం రైతులందరికి రుణమాఫీ చేస్తుందని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి,మాజీ ఎంపీటీసీలు షేక్ నాజార్ అహ్మద్,కుర్మే మహేందర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబుద్, యాళ్ల ఇంద్రారెడ్డి,తదితరులు పాల్గొన్నారు

## నాయకత్వ లక్షణాలు వెలికితీయడంలో క్రీడలు దోహదం

### బీసీ వసతిగృహ విద్యార్థుల జిల్లాస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

**ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడాకారులతో ఆడి ఉత్సాహపరిచిన కలెక్టర్**



**ఆదిలాబాద్ మహా :** విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను వెలికితీయడంతో సహా....క్రమశిక్షణ, పోటీ తత్వం పెరిగేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బీసీ వసతి గృహ విద్యార్థుల జిల్లాస్థాయి క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను బీసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో సరదాగా క్రీడలు ఆడుతూ ఉత్సాహపరిచారు. టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. క్రీడా స్ఫూర్తితో మెలుగుతూ పోటీల్లో రాణించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సూచనల మేరకు బీసీ వెల్ఫేర్ వసతి గృహాల విద్యార్థులకు పోటీలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఉజ్వల భవిత పొందాలని సూచించారు. క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు ఉపయోగపడతాయని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సత్తా చాటాలన్నారు. డైట్ చార్జీల పెంపు పట్ల విద్యార్థుల నుండి సంతోషం వ్యక్తమవుతుందన్న ఆయన.... విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ కమిటీలను నియమించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి రాజలింగు, డీవై ఎస్ ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జన్నారంలో బ్యాట్మింటన్ పోటీలు



**మంచిర్యాల మహా :** మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ ప్రైవేట్ స్కూల్ లో అట్టహాసంగా మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి.ఈ టోర్నమెంట్ కు ముఖ్య అతిథులు గా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ ఫణిరాజ్ , జన్నారం ఎస్సై రాజవర్ధన్ లు హాజరై టోర్నమెంట్ ను ప్రారంభించారు. విద్యార్థులు చదువు తో పాటు ఆటపాటలలో కూడా ముందుండాలని అతిథులు సూచించారు. ఆటలతో విద్యార్థులు ఆరోగ్య వంతులయి చదువులో చురుకుగా తయారవుతారని అన్నారు, పాల్గొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వం పేద మధ్య తరగతి వర్గాల సమస్యలు తీర్చాలి

### ధర్మ సమాజ్ పార్టీ



**ఆదిలాబాద్ మహా :** బోథ్ మండల కేంద్రం లో పేద ప్రజలకు మెరుగైన విద్య వైద్యం,యువత కు ఉపాధి ,పేదలకు ఇళ్లు,భూమి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బోథ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బోథ్ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు. ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వినతిపత్రం అందించారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 90% పైన పేద, మధ్యతరగతి వర్గాలైన బీసీ, ఎస్టీ , ఎస్సీ, ఈబీసీ ప్రజలు దాదాపు ఒక కోటి కుటుంబాలు ఉన్నాయని, వీరు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు. ఈ ఐదు సమస్యలను పరిష్కరించడం ద్వారా తెలంగాణ ప్రజలంతా సుఖ: సంతోషాలతో, శాంతి, సామరస్యాలతో జీవిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు ఈ 5 డిమాండ్స్ ఉంచుతున్నామన్నారు.వీటిని అమలు చేసి రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలలో సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక మార్పుని తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్ బోథ్ మండల, డీఎస్పీ ఉపాధ్యక్షులు కుందూరు సుధాకర్, ప్రధాన కార్యదర్శి బిక్క రమేష్, కార్యదర్శి రాథోడ్ నరేందర్ , రజక సంఘం మండల నాయకులు నరేష్, డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు సోలంకి సుభాష్, కుందూరు శ్రీనివాస్,ఎంఆర్పీఎస్ మండల నాయకులు నక్క రాజశేఖర్, బజార్హత్నూర్ డిఎస్పీ అధ్యక్షులు నరేష్, .రాకేష్ ఇచ్చోడ మండల డిఎస్పి నాయకులు లక్ష్మణ్ ,శ్రీనివాస్ ,స్వామి, బిక్క రాకేష్ ,దినేష్,సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

### వామపక్ష విద్యార్థి సంఘాల

# బంద్ సక్సెస్

## విద్యాశాఖకు మంత్రి కేటాయించాలి

**పెండింగ్ ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్ వెంటనే విడుదల చేయాలి**

**రంగారెడ్డి జిల్లా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు శివకుమార్, వినోద్కుమార్**



**అబ్దుల్లాపూర్మెట్, నవంబర్** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ పాయిజన్తో 51 మంది మృతి చెందడంతో వామ పక్ష విద్యార్థి సంఘాలు శనివారం విద్యా సంస్థల బంద్ పిలుపు నిచ్చిన విషయం తెలిసిందే. ఈ బంద్కు విద్యాసంస్థలన్నీ సహకరించి బంద్ సక్సెస్ చేశారని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వామ పక్షాల విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గుండె శివకుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వినోద్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో 51 మంది మృతి చెందడంతో వామపక్ష విద్యార్థి సంఘాలు నిరసనగా బంద్ పిలుపునిచ్చామని తెలిపారు. బంద్లో భాగంగా అబ్దుల్లపూర్ మెట్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేశామన్నారు. అదే విధంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం కావొస్తున్న ఇంత వరకు విద్యాశాఖ మంత్రే దిక్కు లేదన్నారు. విద్యాశాఖ మంత్రిని వెంటనే కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగం సమస్యలు పరిష్కరించాలన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని ఏడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృత్తం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదే విధంగా అసెంబ్లీ ముట్టడికి కూడా వెనుకాడబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అబ్దుల్లపూర్ మెట్ మండల కార్యదర్శి గువ్వల వంశీ, ఉపాధ్యక్షుడు సాయి, ఎఐఎస్ఎఫ్ అబ్దుల్లపూర్ మెట్ మండల అధ్యక్షుడు వెంకటేష్ నాయకులు నవీన్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# బరువు తగ్గడానికి నాలుగు గింజలు

## అవి ఏంటో ఒకసారి తెలుసుకోండి.. వాటిని మీ డైట్లో భాగం చేసుకోండి

**ప్రస్తుత సమాజంలో మనం తింటున్న తిండికి మనిషి ఈజీగా బరువు పెరుగుతున్నారు. బరువు తగ్గాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా విఫలమే అవుతోంది. కాని కేవలం కేవలం 4 రకాల గింజలు తింటే చాలు బరువు తగ్గిపోతారు. మీరు తినే ఆహారంలో ఏలాంటి డైట్ భాగం చేసుకోవాలో తెలుసుకోండి.**

**మహా, ఆరోగ్యం:**

మనం కొన్ని రకాల సీడ్స్ ని డైట్ లో భాగం చేసుకోవడం వల్ల ఈజీగా బరువు తగ్గవచ్చట. అవును. మీరు సీడ్స్ తినడం వల్ల... ఎక్కువ సేపు కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. ఫలితంగా ఈజీగా బరువు తగ్గుతాం. అదేవిధంగా చాలా రకాల ఆరోగ్య సమస్యలు కూడా పరిష్కరించగలం.

గుమ్మడికాయ గింజల్లో జింక్ పుష్కలంగా ఉంటుంది, ఇది శరీరంలోని కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. వీటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారికి గుమ్మడికాయ గింజలు చాలా మంచివి.

అవిసె గింజలు ఒమేగా-3లకు అద్భుతమైన మూలం. ఇవి చెడు కొవ్వులను కరిగించడానికి, ఇన్సులిన్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. ఇవి ఫైబర్, ఐరన్, ప్రొటీన్లతో కూడా సమృద్ధిగా ఉంటాయి, ఇవి బరువు తగ్గడంలో సహాయపడతాయి. మీకు నచ్చిన విధంగా అవిసె గింజలను తీసుకోండి.

చియా గింజల్లో ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు శరీరంలోని కొవ్వును తగ్గించడానికి, ఆకలిని నియంత్రించడానికి, ఎక్కువసేపు శక్తినివ్వడానికి సహాయపడతాయి.

పొద్దుతిరుగుడు గింజలు బరువు తగ్గడానికి చాలా మంచివి. ఇవి విటమిన్ Eకి గొప్ప మూలం, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్గా పనిచేస్తాయి. వీటిలోని మెగ్నీషియం శక్తినిస్తుంది, కేలరీలను బర్న్ చేయడంలో సహాయపడుతుంది. కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారికి పొద్దుతిరుగుడు గింజలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి.

### రైతు పండుగకు హాజరైన


# ఉప్పరగూడ సొసైటీ రైతులు



**ఇబ్రహీంపట్నం: నవంబర్ 30 మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి కావొస్తున్న సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో రైతుల పండుగ నిర్వహిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, శేరిగూడలోని ఉప్పరగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ యేదుల్ల పాండురంగ రెడ్డి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ లో జరిగిన రైతు పండుగ మహా సభకు సహకార సొసైటీ రైతులతో కలిసి బస్సులో బయలుదేరి రైతు పండుగ సభలో హాజరు కావడం జరిగింది. రైతును రాజు చేయడమే ప్రజా ప్రభుత్వం ఉద్దేశం. రైతులకు మేలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం అని, రైతుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కంబాలపల్లి రాజశేఖర్ రెడ్డి, జిల్లా, మండల వ్యవసాయ అధికారులు, సహకార బ్యాంక్ సీఈవో బోసుపల్లి గణేష్, వంగేటి తిరుమలరెడ్డి కరుణాకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# కాబోయే మంత్రికి మహిళలంటే గౌరవం లేదు

## హెగ్సేత్పై ఆయన తల్లి గతంలో చేసిన విమర్శలు



**అమెరికా:** అమెరికా దేశ రక్షణశాఖ మంత్రిగా పీట్ హెగ్సేత్ను నియమిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే హెగ్సేత్పై ఆయన తల్లి గతంలో చేసిన విమర్శలు ఇప్పుడు తెర పైకి వచ్చాయి. మహిళలతో తన కుమారుడి ప్రవర్తనపై ఆమె సంచలన ఆరోపణలు చేశారు. మహిళలతో పీట్ హెగ్సేత్ ప్రవర్తన సరిగా లేదంటూ 2018లో పెనెలోప్ హెగ్సేత్ పంపిన మెయిల్ను న్యూయార్క్టైమ్స్ బయటపెట్టింది. ''నువ్వు (తన కుమారుడిని ఉద్దేశిస్తూ) మహిళలతో అమర్యాదగా ప్రవర్తించావు. స్వలాభం కోసం స్త్రీలను చులకన భావంతో చూడడం, వారిపై అవాస్తవాలు మాట్లాడే వ్యక్తివి. అందుకే నేను నిన్ను ఎప్పటికీ గౌరవించను. ఒక తల్లిగా కుమారుడి ప్రవర్తనపై మౌనంగా ఉండాలని ప్రయత్నించాను. కానీ, సమంత (పీట్ హెగ్సేత్ రెండో భార్య) అనుభవించిన బాధను తెలుసుకున్న తర్వాత సహించలేకపోయాను. ఒక మహిళగా నేడు దీని గురించి మాట్లాడుతున్నా'' అని ఆమె మెయిల్లో పేర్కొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

## వరుస చోరీలకు పాల్పడిన నేరస్తులు

**ఆదిభట్ల పరిధిలో 18 తులాల బంగారం**

**కర్ణాటకలోనూ మరో 20 తులాల బంగారం చోరీ**

**నిందితుల్లో ఒకరు బాల నేరస్థుడు**

**కేసు నమోదుచేసి రిమాండ్ చేసిన పోలీసులు**

**మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి వెల్లడి**



**ఇబ్రహీంపట్నం: నవంబర్ 30 మహా:** వివాహలు, శుభకార్యాలను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసిన పోలీసులు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి సునీత రెడ్డి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లిలోని ట్రాంక్విల్ రీస్టార్ట్ లో ఈనెల 14వ తేదీన వివాహంలో జరిగిన చోరీని కేసును పోలీసులు చేదించడం జరిగింది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్ ఘడ్ జిల్లా గుల్ఖేడి , హల్కేడి, కడియా గ్రామాలలో దొంగతనాలను వృత్తిగా ఎంచుకొని, అంతర్రాష్ట్ర నేరస్తులు ముఠాగా ఏర్పడిన కొందరు వ్యక్తులు శుభకార్యాలను ఎంచుకొని అదును చూసి దొంగతనాలకు పాల్పడతారని, పోలీసులను కూడా ఈ మూడు గ్రామాలలోకి రానివ్వకుండా చూస్తారని వివరించారు.

**నేరస్తుల ప్రణాళికలు...**

నిందితులు దొంగతనానికి పాల్పడే ముందు పెళ్లి వేడుకలు జరిగే ప్రాంతాలకు వెళ్లి, ముందుగా ఒక బాలుడిని పంపించి జనాలలో కలిసిపోయే విధంగా చేస్తారు. తర్వాత మరో ముగ్గురు ఫంక్షన్ హాల్ లోపటికి వెళ్లి వాళ్ళతో కలిసిపోతారన్నారు. పెళ్లి ముఖ్యలైన మహిళలను గుర్తించి, ఎవరైతే విలువైన వస్తువులు ఉన్న బ్యాగులను భద్రపరుస్తూ ఉంటారో వాళ్ళను గమనిస్తూ ఉంటూ వాళ్లను ఏమార్చి బ్యాగులో ఉన్న నగదు బంగారాన్ని దొంగిలించి అక్కడి నుంచి పరార్ అవుతారని డిసిపి తెలిపారు. ఈనెల 14వ తారీఖున బ్రాహ్మణపల్లి పరిధిలోని ట్రాంక్విల్ రిసార్ట్ లో జరిగిన పెళ్లి వేడుకలోకి చొరబడి చొరబడి పెళ్లి వాళ్ళతో కలిసిపోయి మమేకమై 18 తులాల బంగారు నగలను నిందితులు అపహరించి అక్కడి నుంచి హుడాయించారు. అది గమనించిన పెళ్లి కూతురి తండ్రి తమ నగలు చోరీకి గురయ్యాయని గుర్తించి ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన కేసు నమోదు చేసుకున్న ఆదిభట్ల పోలీసులు ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు పర్యవేక్షణలో, సీఐ రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు టీములుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టిన పోలీసులు చాకచక్యంగా ఇద్దరు నిందితులను పట్టుకున్నారని అందులో ఒకరు మైనర్(12) కాగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు డిసిపి సునీత రెడ్డి వివరాలు వెల్లడించారు. నేరస్తుల వద్ద నుండి 40,000 రూపాయల నగదు, 38 తులాల బంగారు ఆభరణాలు, ఒక కారు (MP 04.ED.7060), ఒక సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను రిమాండ్ కూ తరలిస్తున్నట్లు మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి వెల్లడించారు. ఈ నేరస్తులపై గతంలోనే మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర రాష్ట్రాలలో పలు కేసులు ఉన్నాయని తెలిపారు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 18 తులాల బంగారాన్ని చోరీ చేయగా, కర్ణాటక రాష్ట్రంలో ఇక్కడి మాదిరిగానే మరో 20 తులాల బంగారు ఆభరణాలను అపహరించినట్లు చేశారని తెలిపారు.

### చిన్నప్పటి నుంచి నేరస్థులుగా..

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని, మూడు గ్రామాలలో దొంగతనాలే పనిగా ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి పిల్లలను, మహిళలను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడే విధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఈ క్రమంలో చిన్న వయసు నుంచే దొంగతనాలు దోపిడీలు ఎలా చేయాలనే దానిమీద తెలుసుకొని ఇతర రాష్ట్రాలలోకి చొరబడి, పెళ్లిళ్లు శుభకార్యాలలో నేరాలకు పాల్పడుతుంటారు. చదువుకునే వయసులో నేరాలకు దోపిడీలు చేస్తూ నేరస్తులుగా మారి వాళ్ళ యొక్క జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని కొందరు ఆరోపిస్తున్నారు.



# భారత్లో భారీగా పాము కాటు మరణాలు

## ఏటా 45,900 నుంచి 58 వేల మంది వరకు మృత్యువాత

### పాము కాటు మరణాలు తగ్గించాలని కేంద్రం ఆదేశాలు

ప్రపంచవ్యాప్తంగా పాముకాటు కారణంగా సంభవిస్తున్న మరణాల రేటులో భారత్లో అత్యధికంగా ఉన్నది. ఓ అంచనా ప్రకారం ఏటా 45,900 నుంచి 58వేల మంది వరకు పాముకాటు కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులకు లేఖ రాశారు. పాముకాటు కేసులు, మరణాలను 'నోటిఫై చేయదగిన వ్యాధి'గా మార్చాలని సూచించారు. దాంతో ఒకపై పాముకాటు మరణాలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి రానున్నది. 2030 నాటికి పాముకాటు మరణాలను సగానికి తగ్గించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ 2030 నాటికి పాముకాటు మరణాల నివారణ కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళికను ప్రారంభించింది. పాముకాటుతో మరణంతో పాటు వైకల్యానికి దారి తీస్తుందని కార్యదర్శి పేర్కొన్నారు. రైతులు, గిరిజనులు ఎక్కువగా ప్రమాదంలో ఉన్నారని తెలిపారు. పాముకాటు కేసులు, మరణాలను నిఘాను పెంచడమే ప్రణాళిక ప్రధాన లక్ష్యమని చెప్పారు. పాముకాటు వ్యాధులు, మరణాలను ప్రజారోగ్య చట్టం.. ఇతర వర్తించే చట్టం ప్రకారం.. 'నోటిఫై చేయదగిన వ్యాధులు'గా మార్చాలని అభ్యర్థించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్య సౌకర్యాలు (మెడికల్ కాలేజీలతో సహా) పాముకాటు కేసులు, మరణాలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.




# సబ్బుల ధరలకు రెక్కలు..

## టీ పొడి కూడా..

### 8% వరకు పెంచిన ఎఫ్ఎంసీజీలు

### పామాయిల్ ధరలు పెరగడం వల్లనే..

**న్యూఢిల్లీ :** సబ్బుల ధరలకు రెక్కలొచ్చాయి. దేశంలో అతిపెద్ద ఎఫ్ఎంసీజీ సంస్థలు అన్ని రకాల సబ్బుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. పామాయిల్ ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెరగడం వల్లనే వీటి ధరలను 7 శాతం నుంచి 8 శాతం వరకు పెంచాల్సి వచ్చిందని హెచ్‌యూఎల్, విప్రో సంస్థలు ప్రకటించాయి. సబ్బుల తయారీలో కీలక ముడిసరుకైన పామాయిల్ ధర అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమన్నది. దీంతో పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి సబ్బుల ధరలు పెంచకతప్పలేదని సంస్థలు పేర్కొన్నాయి. మార్జిన్లు తగ్గుముఖం పట్టడంతో వీటి ధరలను ప్రస్తుత త్రైమాసికంలో పెంచాల్సి ఉంటుందని గత త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు సందర్భంగా ప్రకటించాయి కూడా. సబ్బుల తయారీలో కీలక ముడిసరుకైన పామాయిల్ ధరలు గడిచిన ఏడాదికాలంలో 30 శాతం వరకు పెరిగాయని విప్రో కన్జ్యూమర్ కేర్ సీఈవో నీరజ్ ఖత్రియా తెలిపారు. మిగతా సంస్థలు కూడా తమ సబ్బుల ధరలను 78 శాతం వరకు పెంచుతాయని అనుకుంటున్నట్లు చెప్పారు. గడిచిన మూడు నెలల్లోనే పామాయిల్ ధరలు 35 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగాయి. అంతర్జాతీయంగా ధరలు పెరగడంతోపాటు దిగుమతి సుంకం పెరగడం ఇందుకు కారణం. ప్రస్తుతం పది కిలోల పామాయిల్ ధర రూ.1,370గా ఉన్నది.

### టీ పొడి ధరలు కూడా..

టీ పొడి ధరలు కూడా పెంచాయి సంస్థలు. అస్థిర వాతావరణ పరిస్థితుల కారణంగా టీ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం వల్లనే ధరలు సవరించాల్సి వచ్చిందని హెచ్‌యూఎల్, టాటా కన్జ్యూమర్ సంస్థలు ప్రకటించాయి. టీ పొడి ధరలను 25 శాతం నుంచి 30 శాతం వరకు సవరించినట్లు టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్ ఇప్పటికే ప్రకటించింది కూడా.

# రూపీ.. ఆల్‌టైమ్ లో

### ఒక్కరోజే 13 పైసలు పతనం

### 84.60 వద్దకు మారకపు విలువ క్షీణత



**ముంబై :** డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ శుక్రవారం ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది. ఈ ఒక్కరోజే 13 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా భారతీయ కరెన్సీ 84.60 వద్దకు క్షీణించింది. దేశ జీడీపీ వృద్ధిరేటు దాదాపు రెండేండ్ల కనిష్ఠానికి పతనం కావడం.. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను అదేపనిగా ఉపసంహరించుకుంటుండటం ఓవరాల్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని ఫారెక్స్ మార్కెట్ ట్రేడర్లు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. దీనికితోడు దేశంలోని దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్ కూడా రూపీని బలహీనపర్చిందని చెప్తున్నారు. నిజానికి ఇటీవలికాలంలో డాలర్ ముందు రూపీ వెలవెలబోతూనే ఉన్నది. ఒక్కరోజే 10 పైసలకుపైగా క్షీణించిన సందర్భాలు అనేకం ఉన్నాయంటే కరెన్సీ మార్కెట్‌లో రూపాయి ఎదుర్కొంటున్న ఒత్తిడిని అర్థం చేసుకోవచ్చు. రూపాయి విలువ ఇలాగే పడిపోతే ఆ ప్రభావం.. ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు, జీడీపీలపై గట్టిగానే పడవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## కోలుకున్న స్టాక్ మార్కెట్లు

భారీ నష్టాల నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం కోలుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 759.05 పాయింట్లు లేదా 0.96 శాతం ఎగిసి 79,802.79 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 880.16 పాయింట్లు పెరగడం గమనార్హం. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 216.95 పాయింట్లు లేదా 0.91 శాతం ఎగబాకి 24వేల స్థాయికి ఎగువన 24,131.10 వద్ద నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. రంగాలవారీగా హెల్త్‌కేర్, టెలికమ్యూనికేషన్స్, ఎనర్జీ, టెక్నాలజీ షేర్లు రాణించాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.76 శాతం, మిడ్‌క్యాప్ 0.31 శాతం మేర పుంజుకున్నాయి. గురువారం సెన్సెక్స్ 1,190, నిఫ్టీ 361 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే.

# విమానాల్లో బ్లాక్ ఫ్రైడే ఆఫర్లు

### 20 శాతం వరకు ఎయిర్ ఇండియా ఆఫర్

### రూ.1,199కే ఇండిగో ప్రారంభ టికెట్




**న్యూఢిల్లీ :** విమాన ప్రయాణికులను ఆకట్టుకోవడానికి పలు విమానయాన సంస్థలు ప్రత్యేకంగా 'బ్లాక్ ఫ్రైడే సేల్స్' ఆఫర్లను ప్రకటించాయి. దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగోతోపాటు ఎయిర్ ఇండియా ఈ ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. దీంట్లో ఇండిగో ఒకవైపు ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,199గా నిర్ణయించింది. అంతర్జాతీయ రూట్‌లో రూ.5,199కే అందిస్తున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జనవరి 1 నుంచి మార్చి 31, 2025లోపు ఎప్పుడైనా ప్రయాణించవచ్చును. అలాగే ఎయిర్ ఇండియా విమాన టికెట్ల బేస్‌రేట్‌పై 20 శాతం వరకు తగ్గింపు ధరకు విక్రయిస్తుండగా..అంతర్జాతీయ రూట్లపై 12 శాతం తగ్గింపునిస్తున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జూన్ 30, 2025 లోపు ప్రయాణించాల్సి ఉంటుంది. భారత్ నుంచి ఆస్ట్రేలియా లేదా ఉత్తర అమెరికాల మధ్య మాత్రం అక్టోబర్ 30, 2025 లోపు ఎప్పుడైనా ప్రయాణించవచ్చును. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని, లిమిటెడ్ సీట్లు ఉండగా, తొలుత వచ్చిన వారికి మాత్రమే ఈ ఆఫర్ లభించనున్నదని పేర్కొంది. ఈ ఆఫర్లు డిసెంబర్ 2 వరకు అందుబాటులో ఉండనున్నాయి.

# స్కిల్ వర్సిటీలో భాగస్వామ్యం కండి

### విప్రో ప్రతినిధులతో శ్రీధర్ బాబు



**హైదరాబాద్ :** యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విప్రో సంస్థ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో విప్రో కార్యకలాపాల పురోగతిని వివరించేందుకు ఆ సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి రాఘవ్ స్వామినాథన్ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విప్రో సంస్థకు అవసరమయ్యే వారికి స్కిల్ యూనివర్సిటీలో శిక్షణ ఇచ్చి నియమించుకోవాలని సూచించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఇదే తరహాలో 80 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల పరిశ్రమలను ద్వితీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటు చేయాలని రాఘవ్‌ను కోరారు.



# దేశం-విదేశం

## NATIONAL NEWS






# ఫెంగల్ ఎఫెక్ట్.. చెన్నై ఎయిర్ పోర్ట్ మూసివేత..

## ప్రయాణికుల ఇబ్బందులు




నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైవున్న వాయుగుండం శుక్రవారం తుఫానుగా మారింది. ఇది శనివారం సాయంత్రానికి పుదుచ్చేరి సమీపంలో కరైకల్ - మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందని చెన్నై(Chennai) ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఈ తుఫాను ప్రభావంతో తమిళనాడు వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఫెంగల్ తుఫాను ప్రభావంతో రాజధాని చెన్నైలో కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు పూర్తిగా నీటమునిగాయి. బలమైన ఈదురుగాలులతో కురుస్తున్న భారీ వర్షాలకు విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. శనివారం సాయంత్రం 7 గంటల వరకూ విమానాశ్రయాన్ని (Chennai Airport) తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు (temporarily shut) ప్రకటించారు. ఇప్పటికే ఇండిగో సహా పలు విమాన సంస్థలు తమ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఎయిర్‌పోర్ట్ మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఇద్దరు గగనయాత్రికుల ప్రాథమిక శిక్షణ పూర్తి : ఇస్రో

**బెంగుళూరు:** అమెరికా అంతరిక్ష శిక్షణా కేంద్రం నాసా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ఆధ్వరంలో.. ఇద్దరు భారతీయ వ్యోమగాములు అమెరికాలో శిక్షణ పొందుతున్నారు. అయితే ఆ ఇద్దరికి చెందిన ప్రాథమిక శిక్షణ పూర్తి అయినట్లు ఇస్రో ప్రకటించింది. ప్రైమ్ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా, బ్యాకప్ గ్రూపు కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణ నాయర్ .. అమెరికాలో శిక్షణ పొందుతున్నారు. ఏక్సియమ్ మిషన్ 4 కోసం ఈ ఏడాది ఆగస్టు నుంచి వాళ్లు శిక్షణలో ఉన్నట్లు ఇస్రో తెలిపింది. ఇద్దరు గగనయాత్రికుల ప్రాథమిక శిక్షణ విజయవంతంగా పూర్తి అయినట్లు ఇస్రో పేర్కొన్నది. ఆ శిక్షణ సమయంలో.. మిషన్ సంబంధిత గ్రౌండ్ ఫెసిలిటీ టూర్స్, మిషన్ లాంచ్ ఫేస్, స్పేస్‌ఎక్స్ సూట్ ఫిక్స్ చెక్స్, ఫుడ్ ఆప్షన్స్ గురించి శిక్షణ తీసుకున్నారు. స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ గురించి కూడా భారతీయ వ్యోమగాములు శిక్షణ పొందారు. అంతరిక్షంలో ఏర్పడే అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై తొలి దశ శిక్షణలో తెలిపారు. ఇద్దరు గగనయాత్రికుల ప్రాథమిక శిక్షణ విజయవంతంగా పూర్తి అయినట్లు ఇస్రో పేర్కొన్నది. ఆ శిక్షణ సమయంలో.. మిషన్ సంబంధిత గ్రౌండ్ ఫెసిలిటీ టూర్స్, మిషన్ లాంచ్ ఫేస్, స్పేస్‌ఎక్స్ సూట్ ఫిక్స్ చెక్స్, ఫుడ్ ఆప్షన్స్ గురించి శిక్షణ తీసుకున్నారు. స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ గురించి కూడా భారతీయ వ్యోమగాములు శిక్షణ పొందారు. అంతరిక్షంలో ఏర్పడే అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై తొలి దశ శిక్షణలో తెలిపారు.

# కమ్ అండ్ సే

### కాంగ్రెస్ లేఖపై స్పందించిన ఈసీ




మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే. ఎన్నికల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సహా అగ్ర నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇక ఈ అంశంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఈసీకి లేఖ రాశారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారంటూ పోలింగ్ డేటాలోనూ తేడాలున్నాయని లేఖలో ప్రస్తావించారు. వ్యక్తిగతంగా హాజరై తమ అనుమానాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ రాసిన లేఖపై ఈసీ తాజాగా స్పందించింది. ఎన్నికలు ప్రతి దశలోనూ పారదర్శకంగా జరిగాయని తెలిపింది. కాంగ్రెస్ నేతల చట్టపరమైన ఆందోళనను తాము పరిశీలిస్తామని హామీ ఇచ్చింది. వారికి ఫలితాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తామని తెలిపింది. ఈమేరకు డిసెంబర్ 3న కాంగ్రెస్ ప్రతినిధులు రావాలని ఆహ్వానించింది. ప్రతినిధుల బృందం అనుమానాలు విన్న తర్వాతే రాతపూర్వకంగా సమాధానం ఇస్తామని ఈసీ స్పష్టం చేసింది.కాగా, ఇటీవలే వెల్లడైన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విపక్ష మహా వికాస్ అఘాడీ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని నమోదు చేసింది.

# ఎంపీ హోదాలో..

## తొలిసారి వయనాడ్‌కు ప్రియాంక గాంధీ



కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవలే కేరళలోని వయనాడ్ స్థానానికి జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించి పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు. రెండు రోజుల క్రితం ఎంపీగా ప్రమాణ స్వీకారం కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ హోదాలో ప్రియాంక తొలిసారి తన నియోజకవర్గం వయనాడ్‌కు వెళ్లారు. సోదరుడు రాహుల్ గాంధీ)తో కలిసి శనివారం ఉదయం కేరళ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అక్కడ ఘన స్వాగతం లభించింది. ఇవాళ వయనాడ్‌లో నిర్వహించిన పబ్లిక్ మీటింగ్‌లో ప్రియాంక పాల్గొని ప్రసంగించనున్నారు.

కాగా, ఇంతకాలం పార్టీ ప్రచారాలకే పరిమితమైన ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తన సోదరుడు రాహుల్ రాజీనామాతో ఖాళీ అయిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసి రికార్డు మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. గత శనివారం వెలువడిన ఫలితాల్లో ఆమె 4.8 లక్షల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 3.64 ఓట్లతో ఉన్న రాహుల్ పేరుతో ఉన అత్యధిక మెజార్టీ రికార్డును ఆమె తుడిచివేశారు. ఈ క్రమంలోనే గురువారం లోక్‌సభలో ఎంపీగా ప్రమాణం చేశారు. కేరళ సంప్రదాయ కసావు చీర కట్టుతో పార్లమెంట్‌లోకి అడుగుపెట్టిన ప్రయాంక.. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేశారు.

# సంభల్‌ను సందర్శించకుండా.. ఎస్పీ బృందాన్ని అడ్డుకున్న పోలీసులు





**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌ను సందర్శించేందుకు ఆ రాష్ట్రంలో ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ప్రయత్నించింది. మొఘల్ కాలం నాటి షాహి జామా మసీదులో సర్వే నేపథ్యంలో నవంబర్ 24న అక్కడ హింస చెలరేగింది. రాళ్లు రువ్వి, వాహనాలకు నిప్పు పెట్టిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఈ హింసాకాండలో నలుగురు వ్యక్తులు మరణించగా పోలీసులతో సహా 30 మందికిపైగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ హింసపై దర్యాప్తు కోసం అసెంబ్లీలో ప్రతిపక్ష నేత మాతా ప్రసాద్ పాండే నేతృత్వంలో 15 మంది సభ్యులతో బృందం ఏర్పాటైంది. శనివారం ఎస్పీ బృందం సంభల్ చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. బయట వ్యక్తులు సంభల్‌లో ప్రవేశించకుండా డిసెంబర్ 10 వరకు నిషేధ ఆదేశాలను ఆ జిల్లా యంత్రాంగం జారీ చేసినట్లు ఆ బృందానికి తెలిపారు. కాగా, తమ పార్టీ బృందాన్ని సంభల్‌లోకి ప్రవేశించకుండా పోలీసులు అడ్డుకోవడంపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్ మండిపడ్డారు. నిషేధం విధించడం బీజేపీ ప్రభుత్వ పరిపాలన, ప్రభుత్వ నిర్వహణ వైఫల్యమని విమర్శించారు. సంభల్‌లో అల్లర్లు సృష్టించాలని కలలు కన్న వారిపై ప్రభుత్వం ముందే నిషేధం విధించి ఉంటే మత సామరస్యం, శాంతియుత వాతావరణానికి భంగం కలిగి ఉండేది కాదన్నారు. నిర్లక్ష్యం, కుట్ర పూరితంగా వ్యవహించిన సంభాల్‌లోని మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని సస్పెండ్ చేయాలని అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు.



# ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్‌కు రెండో విజయం

**రాజ్‌కోట్:** సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్) లో హైదరాబాద్ మళ్లీ గెలుపుబాట పట్టింది. రాజ్‌కోట్‌లో బీహార్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన బీహార్ 20 ఓవర్లలో 118/9 పరుగులకే పరిమితమైంది హైదరాబాద్ బౌలర్ టేకులపల్లి రవితేజ (4/24) రాణించాడు. అనంతరం లక్ష్యాన్ని హైదరాబాద్ 12.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదనను పూర్తి చేసింది. రోహిత్ (56 నాటౌట్), కెప్టెన్ తిలక్ వర్మ (51 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. స్మాట్‌లో ఆడిన 4 మ్యాచ్‌లలో హైదరాబాద్‌కు ఇది రెండో విజయం.


# సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీ.. సెమీస్‌కు సింధు

## అదరగొట్టిన లక్ష్యసేన్, ఉన్నతి



**లక్నో:** గత రెండేండ్లుగా బీడబ్ల్యూఎఫ్ టైటిల్ వేటలో ఉన్న పీవీ సింధు ఆ కొరతను తీర్చుకునే దిశగా కీలక ముందడుగు వేసింది. లక్నోలో జరుగుతున్న సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఆమె సెమీఫైనల్స్‌లోకి అడుగుపెట్టింది. ప్రిక్వార్టర్స్‌లో కష్టమ్మీద నెగ్గిన 18వ ర్యాంకర్ సింధు.. శుక్రవారం ఇక్కడ జరిగిన క్వార్టర్స్‌లో 2115, 2117తో దై వాంగ్ (చైనా)పై గెలిచింది.
48 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో సింధు.. అంతగా అనుభవం లేని చైనా అమ్మాయిపై అలవోక విజయం సాధించింది. సెమీస్‌లో ఆమె భారత్‌కే చెందిన ఉన్నతి హుడాతో అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్స్‌లో ఉన్నతి 2116, 219తో ఇషికా జైస్వాల్ (యూఎస్ఏ)ను ఓడించి సింధుతో పోరుకు సిద్ధమైంది.

ఇక పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 218, 2119తో మీరబ లువాంగ్ (భారత్)ను ఓడించి సెమీస్‌లోకి ప్రవేశించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల తనీషా క్రాస్టో జోడీ, మహిళల డబుల్స్‌లో రెండో సీడ్ త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్ ద్వయం సైతం సెమీస్‌కు అర్హత సాధించాయి.



# ఇండియా వర్సెస్ పీఎం లెవన్ మ్యాచ్..

## వర్షం వల్ల తొలి రోజు ఆట రద్దు

**కాన్‌బెరా:** ఆస్ట్రేలియా ప్రైమ్‌మినిస్టర్స్ లెవన్‌తో జరగాల్సిన ప్రాక్టీస్ మ్యాచ్ ( PM's XI v India) కు వర్షం అడ్డుపడింది. రెండు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఇవాళ కాన్‌బెరాలోని మనూకా ఓవల్‌లో ప్రారంభం కావాల్సి ఉన్నది. కానీ ఎడతెరపిలేకుండా వర్షం పడుతున్న కారణంగా.. తొలి రోజు ఆటను రద్దు చేశారు. దీంతో భారత క్రికెటర్లకు.. పింక్ బాల్ ప్రాక్టీస్ మ్యాచ్ మిస్సయ్యే అవకాశాలు ఉన్నాయి. అడిలైడ్‌లో ప్రారంభం అయ్యే రెండో టెస్టుకు ముందు పింక్ బాల్ మ్యాచ్‌తో భారత్ సంసిద్ధం కావాలనుకున్నది. అయితే ఆదివారం 50 ఓవర్ల మ్యాచ్ ఆడేందుకు రెండు జట్లు అంగీకరించాయి. ఒకవేళ వాతావరణం అనుకూలిస్తే, రేపు ఆ మ్యాచ్ జరుగుతుంది.

# యాషెస్ కంటే.. ఆస్ట్రేలియా- భారత్ మధ్య పోరే పెద్దది..

## ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ వ్యాఖ్యలు..!

ఆస్ట్రేలియా వేదికగా బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్ జరుగుతున్నది. ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో ఇప్పటికే భారత్ 10తో ఆధిక్యంలో ఉన్నది. ఇటీవల భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచులు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లో ఇటీవల పలువురు ఆటగాళ్లు ఇంగ్లండ్ - ఆస్ట్రేలియా మధ్య జరిగే యాషెస్ సిరీస్‌తో పోలుస్తున్నారు. ఈ క్రమంలోనే బోర్డర్ గవాస్కర్ సిరీస్ ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యాషెస్ సిరీస్ కంటే భారత్ - ఆస్ట్రేలియా పోరు పెద్దదని అన్నారు. ఆసిస్ ప్రైమినిస్టర్స్ లెవెన్‌తో వార్మప్ మ్యాచ్ నేపథ్యంలో క్రికెటర్లు ఆయనను కలిశారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్‌ని చూసే వారి సంఖ్య బాగా పెరిగిందని.. ఐపీఎల్ సైతం మెగా లీగ్‌గా మారిందని పేర్కొన్నారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌ను చూసేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీతో వెళ్లాలనని.. ఆ మ్యాచ్‌కు పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియమని.. అక్కడి ప్రజలు క్రికెట్‌పై చాలా మక్కువ చూపుతున్నారన్నారు. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ రెండు జట్ల మధ్య పోటీని మరింత పెంచిందని, ఎంసీజీలో జరిగే బాక్సింగ్ డే టెస్టు చాలా కీలకం కానుందని ఆస్ట్రేలియా ప్రధాని అన్నారు. ఆల్బనీస్ మాట్లాడుతూ భారత్‌తో లండన్‌లో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్ ఆడామని.. తమ జట్టు విజయం సాధించిందన్నారు. అయితే ఈ సిరీస్‌లో పోటీ నువ్వానేనా అన్నట్లుగా జరిగింది. గతంలో మూడు మ్యాచ్‌ల సిరీస్ జరిగిందని.. ప్రస్తుతం 5 టెస్టులు జరుతుండడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. డిసెంబర్ 26 నుంచి జరగనున్న బాక్సింగ్ డే టెస్టు చాలా కీలకం కానుండగా.. ఆ మ్యాచ్‌ని చూసేందుకు దాదాపు లక్ష మంది ప్రేక్షకులు చేరుకునే అవకాశం ఉందని.. ఆస్ట్రేలియా పర్యాటకానికి కీలకమైందన్నారు.

కాన్‌బెర్రాలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో భారత జట్టు భేటీ అయ్యింది. రోహిత్ శర్మ నేతృత్వంలోని బృందం, ఆస్ట్రేలియా పీఎం XI జట్టు పార్లమెంటులో ఆస్ట్రేలియా ప్రధానిని కలిశాయి. అల్బనీస్ భారత జట్టుతో సరదాగా సంభాషించారు. కెప్టెన్ రోహిత్ శర్మ ఆయనకు జట్టును పరిచయం చేశాడు. జస్ప్రీత్ బుమ్రాను అల్బనీస్ ముచ్చటించారు. ఇతర బౌలర్లతో పోలిస్తే బుమ్రా బౌలింగ్ శైలి భిన్నంగా ఉంటుందన్నారు. భారత్‌ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్స్ ఎలెవన్ జట్ల మధ్య జరిగిన పింక్ బాల్ మ్యాచ్‌లో మొదటి రోజు వర్షం కారణంగా రద్దయింది. ఈ మ్యాచ్‌లో ఇప్పటివరకు టాస్ కూడా వేయలేకపోయారు. డిసెంబర్ 6 నుంచి జరగనున్న అడిలైడ్ టెస్టుకు ముందు ఇరు జట్లు ప్రాక్టీస్ మ్యాచ్‌లో పాల్గొంటున్నాయి.

# సత్తాచాటిన టీటీ ప్లేయర్లు



**హైదరాబాద్:** ఇండోర్ (మధ్యప్రదేశ్) వేదికగా జరిగిన యూటీటీ జాతీయ పారా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ప్లేయర్లు సత్తాచాటారు. పురుషుల ఫైనల్లో హితేశ్ దోల్వాని 116, 115, 114తో విశ్వ తంబె (మహారాష్ట్ర)పై గెలిచి టైటిల్ విజేతగా నిలిచాడు. మహిళల క్లాస్4 తుది పోరులో విజయ దీపిక 1012, 711, 911తో భవీనా పటేల్ (గుజరాత్) చేతిలో రన్నరప్‌గా నిలిచింది. మహిళల క్లాస్ 8లో నిశాకుమారి 411, 511, 911తో సవితా అంజనకట్టి (కర్నాటక) చేతిలో ఓడి రజతం దక్కించుకుంది.

# సినిమా వార్తలు MOVIE NEWS



# ఇందులోకి నా భార్యను లాగొద్దు..

## మీడియాకు రాజ్ కుంద్రా విజ్ఞప్తి

బాలీవుడ్ నటి శిల్పా శెట్టి భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రా నివాసాల్లో ఈడీ అధికారులు శుక్రవారం సోదాలు చేపట్టినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సోదాల వార్తలపై రాజ్ కుంద్రా స్పందించారు. కేసుకు సంబంధించి విచారణ జరుగుతోందని.. అందుకు తాను పూర్తిగా సహకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇదే సమయంలో మీడియాకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. సంబంధం లేని విషయాల్లో తన భార్య శిల్పా శెట్టి పేరును పదేపదే వాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు.

'ఎంతటి సంచలనాత్మకమైనా కేసుల్లో అయినా.. అంతిమ విజయం న్యాయానిదే. నాలుగేళ్లుగా ఈ కేసు విచారణ సాగుతోంది. దర్యాప్తునకు నేను పూర్తిగా సహకరిస్తున్నాను. సంబంధంలేని అంశాల్లోకి నా భార్య పేరును లాగుతున్నారు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. మీడియాకు ఇదే నా విజ్ఞప్తి.. మా వ్యక్తిగత గోప్యతను గౌరవించండి' అంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. మరోవైపు ఈ కేసు అంశంలో శిల్పా శెట్టిని లాగడంపై ఆమె తరపు లాయర్ కూడా స్పందించారు. శిల్పాకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని, ఆమెకు అగౌరవపరిచే విధంగా ఫొటోలు, వీడియోలు ఉపయోగించకూడదని మీడియాకు హెచ్చరించారు. ఔత్సాహిక నటీనటులతో అశ్లీల చిత్రాలు తీయించి.. వాటిని విదేశీ యాప్‌ల్లో అప్‌లోడ్ చేసిన కేసులో రాజ్ కుంద్రాను 2021 జూన్‌లో ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తలిసిందే. ముంబై పోలీసుశాఖకు చెందిన ప్రాపర్టీ సెల్.. పోర్న్ వీడియోలు చేస్తున్న ఓ ముఠాను పట్టుకోగా అప్పట్లో ఈ వ్యవహారం బయటపడింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల కోసం షార్ట్ ఫిల్మ్స్ చేస్తున్నామన్న నెపంతో వాళ్లు పోర్న్ వీడియలు తీస్తున్నట్లు గుర్తించారు. పోర్న్ వీడియోలు షూట్ చేసిన తర్వాత.. వాటిని వీట్రాన్స్‌ఫర్ ద్వారా విదేశాలకు ఆ కామెంట్‌ను పంపిస్తారు.అయితే భారతీయ చట్టాల నుంచి తప్పించుకునేందుకు ఆ అశ్లీల చిత్రాలను అక్కడి యాప్స్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ కేసును విచారిస్తున్న క్రైం బ్రాంచ్ పోలీసులకు ఈ విషయాలు తెలిశాయి. ఈ వ్యవహారంలో ఉమేశ్ కామత్ అనే వ్యక్తిని క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. అతను రాజ్‌కుంద్రా వద్ద పనిచేసేవాడు. ఉమేశ్ కామత్‌ను అరెస్టు చేసిన తర్వాతే.. ఆ పోర్న్ రాకెట్‌లో కుంద్రా పాత్ర ఉన్నట్లు తేలింది. విచారణ అనంతరం పక్కా ఆధారాలతో 2021 జులై 20న రాజ్ కుంద్రాను పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత కొన్ని రోజులు విడుదలయ్యారు.


# ఇలాంటి కేరక్టర్‌ని ఎవరూ ఊహించరు : అలియాభట్



'గంగూభాయ్ కతియావాడీ' తర్వాత సంజయ్‌లీలా బన్సాలీ దర్శకత్వంలో అలియాభట్ చేస్తున్న సినిమా 'లవ్ అండ్ వార్'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతున్నది. అలియా, విక్కీ కౌశల్‌పై కీలక సన్నివేశాలను బన్సాలీ తెరకెక్కిస్తున్నారు. రణబీర్ కపూర్ ఇందులో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా గురించి ఇటీవల అలియా మీడియాతో మాట్లాడింది. 'లవ్ అండ్ వార్' ఓ పిరియాడిక్ డ్రామా.


ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే పనిలో ఉన్నారు సంజయ్‌లీలా బన్సాలీ. ప్రేక్షకుల్ని కొన్ని దశాబ్దాల వెనక్కి తీసుకెళ్లనున్నారాయన. ఆయన దర్శకత్వంలో మళ్లీ నటించడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్ర డిఫరెంట్‌గా ఉంటుంది. ఇలాంటి కేరక్టర్‌ని ఎవరూ ఊహించరు. నటిగా నాలోని కొత్తకోణాన్ని 'గంగూభాయ్' ఆవిష్కరించింది. అలాగే ఈ సినిమాలో కూడా కొత్త అలియాను చూస్తారు. 2026 మార్చి 20 వరకూ వెయిట్ చేయండి.' అంటూ చెప్పుకొచ్చింది అలియాభట్.

# పుష్ప టికెట్ రేట్ల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా వస్తున్న పాన్ ఇండియన్ మూవీ 'పుష్ప 2: ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పుష్ప 2 టికెట్ ధరలు పెంచుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల నుంచి బెనిఫిట్ షోలతో పాటు అర్ధరాత్రి 1 షోలకు అనుమతినిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే సింగిల్ థియేటర్‌లలో, మల్టీప్లెక్స్‌ల్లో ఈ బెనిఫిట్ షోలకు టికెట్ ధరలు రూ.800గా ఖరారు చేసింది. మరోవైపు అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఎక్స్‌ట్రా షోలకు అనుమతినిచ్చింది. డిసెంబర్ 05 నుంచి 08 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 పెంచింది. అలాగే.. డిసెంబర్ 09 నుంచి 16 వరకు సింగిల్ థియేటర్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌లో రూ.150 పెంపునకు అనుమతిని ఇచ్చింది. డిసెంబర్ 17 నుంచి 23 వరకు సింగిల్ థియేటర్‌లలో రూ.20 మల్టీప్లెక్స్‌లో రూ.50 పెంపునకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో దాదాపు 18 రోజులు ఈ పెంచిన రేట్లు అమలులో ఉండనున్నట్లు వెల్లడించింది. ఇక తెలంగాణ అడ్వాన్స్‌కు బుకింగ్‌కు సంబంధించి నేడు సాయంత్రం 4.56 గంటల నుంచి ప్రారంభం కానున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది.

# విడుదలై నెల కూడా కాకుండానే ఓటీటీలోకి వరుణ్ తేజ్ మట్కా



విడుదలై నెల కూడా కాకుండానే ఓటీటీలోకి రాబోతుంది వరుణ్ తేజ్ మట్కా మూవీ. వరుణ్ కెరీర్‌లో బిగ్గెస్ట్ డిజాస్టార్‌గా నిలిచిన ఈ సినిమా తాజాగా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. మెగా హీరో వరుణ్ తేజ్‌కి ఈ మధ్య అసలు కలిసి రావాట్లేదన్న విషయం తెలిసిందే. అప్పుడెప్పుడో ఫిదా, తొలిప్రేమ సినిమాలతో సాలిడ్ హిట్లు అందుకున్న ఈ కుర్ర హీరో కెరీర్ గ్రాఫ్ సడన్‌గా పడిపోయింది. ఆపరేషన్ వాలంటైన్, గాండీవ ధారి అర్జున, గని సినిమాలతో వరుస డిజాస్టార్‌లను అందుకున్నాడు. ఇప్పుడు మట్కా సినిమాతో తాజాగా మరో డిజాస్టార్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఈ సినిమా ఎంతటి పరజయం అందుకుంది అంటూ కనీసం పెట్టిన బడ్జెట్ కూడా రాకపోవడం విశేషం. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా డిసెంబర్ 05 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు వెల్లడించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com